




నరసరావుపేట ప్రాంతంలో శనగ

అంచనాలకే.. ఆపసోపాలు

- బుగ్గవాగు రిజర్వాయర్ సామర్థ్యం పెంపు లేనట్లే..
- వ్యయం అంచనాల దశ దాటని పనులు
- బుగ్గవాగు పైనే జల జీవన్ మిషన్, వాటర్ గ్రిడ్ పథకాలు ఆధారం

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

తాగు, సాగునీటి అవసరాల కోసం నాగార్జున సాగర్ కుడికాలువ పరిధిలోని బుగ్గవాగు రిజర్వాయర్ సామర్థ్యం పెంపు దశాబ్దాల కల. ప్రభుత్వాలు మారుతున్నాయి తప్ప ఈ కలకు సాకారం కావడంలేదు. తెలుగుదేశం ప్రభుత్వం బుగ్గవాగు అభివృద్ధికి రూ.202 కోట్లు మంజూరు చేసింది. ప్రస్తుత ప్రభుత్వం బుగ్గవాగు సామర్థ్యాన్ని 3.5 టీఎంసీల నుంచి 7 టీఎంసీలకు పెంచుతామని ఆర్భాటంగా ప్రకటించింది. నేటికి కార్యరూపం దాల్చలేదు. ఈ ప్రాజెక్టుకు సంబంధించిన పనులు వ్యయం అంచనాలు దగ్గరే నిలిచిపోయాయి. బుగ్గవాగు అభివృద్ధిపై ప్రభుత్వానికి చిత్తశుద్ధి కొరవడింది.



బుగ్గవాగు రిజర్వాయర్ నుంచి నీటి సరఫరా

నిలిచిన పనుల వ్యయం అంచనాలు

బుగ్గవాగు బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ దుర్గి ప్రాంతంలో కుడికాలువ 27 నుంచి 33వ కిలోమీటర్ మధ్యలో ఉంది. నీటి నిల్వ సామర్థ్యం 3.46 టీఎంసీలు. డెడ్ స్టోరేజి 1.69 టీఎంసీలు కాగా 1.77 టీఎంసీల నీటిని వినియోగించుకోచ్చు. సామర్థ్యాన్ని పెంచడం ద్వారా తాగు, సాగునీటి అవసరాలు తీర్చవచ్చన్న ప్రతిపాదనలు దశాబ్దాలుగా ఉన్నాయి. రిజర్వాయర్‌ను 3.46 టీఎంసీల నుంచి 4.77 టీఎంసీలకు పెంచాలని తెలుగుదేశం ప్రభుత్వం నిర్ణయించింది. ఇందుకు నిపుణుల కమిటీ కూడా నాడు ఆమోదం తెలిపింది. రూ.424 కోట్ల వ్యయం అవుతుందని అంచనాలు రూపొందించారు. రూ.202 కోట్లు నిధులు కూడా మంజూరు చేశారు. ఐతే 3.46 టీఎంసీల నుంచి 7 టీఎంసీలకు సామర్థ్యాన్ని పెంచుతామని ప్రస్తుత ప్రభుత్వం ప్రకటించి ఇందుకు సంబంధించిన డీపీఆర్ రూపొందించాలని జలవనరుల శాఖను ఆదేశించింది. ఇందుకోసం నిధులు కూడా విడుదలయ్యాయి. 2020 అక్టోబరులో డీపీఆర్ కోసం కాంట్రాక్టర్‌ను నియమించాలని ఇందుకు సంబంధించిన టెండర్‌ను కూడా జలవనరుల శాఖ పిలిచి కాంట్రాక్టర్‌కు పనులు అప్పగించారు. కాంట్రాక్టర్ తప్పుకోవడంతో పనులు వ్యయం అంచనాలు రూపొందించడం నిలిచిపోయింది.

ఏడాదంతా నీరందించే అవకాశం..

బుగ్గవాగు సామర్థ్యం పెంపుపైనే తాగునీటి పథకాల అభివృద్ధి ఆధారపడి ఉంది. పల్నాడు, ప్రకాశం, బాపట్ల, గుంటూరు జిల్లాల ప్రజలు వేసవిలో తాగునీటికి తీవ్ర ఇక్కట్లు పడుతున్నారు. బుగ్గవాగు సామర్థ్యం పెంచితే ఏడాది పొడవునా తాగునీరు అందించే అవకాశం ఉంటుంది. గ్రామాల్లో తాగునీటి సమస్యలు పరిష్కారం, ప్రతి వ్యక్తికి 55 లీటర్ల తాగునీరు అందించాలన్నది కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన జలజీవన్ మిషన్ పథకం లక్ష్యం. బోర్లు నీటి సరఫరాను నిలిపి వేసి సాగర్ నీటిని అందించాలన్న దిశగా ఈ మిషన్ పనులు సాగుతున్నాయి. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా జల జీవన్ మిషన్ పనులు చేపట్టాయి. కాగా పల్నాడు వాటర్ గ్రిడ్ పథకాన్ని ప్రభుత్వం ప్రకటించిన విషయం తెలిసిందే. రూ.1,500 కోట్ల వ్యయంతో తాగునీటి పథకాలను అభివృద్ధి చేసి బుగ్గవాగు నుంచి పైపులైన్ ద్వారా నీటిని గ్రామాలకు సరఫరా చేయాలని నిర్ణయించారు. ఇలా జల్‌జీవన్ మిషన్, వాటర్ గ్రిడ్ పథకాలు బుగ్గవాగు సామర్థ్యం పెంపుపై ఆధారపడి ఉన్నాయి. తాగు, సాగు నీటి అవసరాలను తీర్చే బుగ్గవాగు రిజర్వాయర్ సామర్థ్యం పెంపు పనులు కాగితాలకే పరిమితం కావడం గమనార్హం. పనులు చేపట్టకపోవడం పట్ల ప్రజలు తీవ్ర అసంతృప్తిని వ్యక్తం చేస్తున్నారు. వ్యయం అంచనాలు ఎప్పటికి రూపొందిస్తారో వేచి చూడాలి.

రబీలోనూ.. కరువే

ఖరీఫ్ సీజన్ పంటల సాగుకు కలిసిరాలేదు. రబీలోనూ అదే పరిస్థితి నెలకొంది. రబీ అయినా సాగుకు కలసి వస్తుందని ఆశపడ్డ అన్నదాలకు అడియాశే మిగిలింది. జలాశయాల్లో నీటి నిల్వలు నిండుకోవడంతో సాగుకు నీరులేదు. కేవలం వర్షాధారంపైనే ఆధారపడి పంటలు సాగు చేశారు. సాధారణం కంటే పల్నాడు, గుంటూరు, బాపట్ల జిల్లాలో 1.75 లక్షల ఎకరాల్లో పంటలు సాగు తగ్గింది. వరి సాగును రైతులు పూర్తిగా కోల్పోయారు. అటు ఖరీఫ్, ఇటు రబీలో తీవ్ర వర్షాభావంతో రైతులు తీవ్రంగా నష్టపోయారు.

- ఖరీఫ్ మాదిరిగానే తగ్గిన సాగు
- బీళ్లుగా 1.75 లక్షల ఎకరాలు
- గణనీయంగా తగ్గిన వరి, మొక్కజొన్న
- శనగ, పొగాకు సాగు పెరుగుదల

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

ఖరీఫ్ నాటితో పోలిస్తే రబీలో కరువు పరిస్థితులు మరింత తీవ్రమయ్యాయి. సాధారణం కంటే అక్టోబరు, నవంబరులో పల్నాడు జిల్లాలో 52.47 శాతం తక్కువ వానలు కురిశాయి. గుంటూరు జిల్లాలో 62.06శాతం, బాపట్ల జిల్లాలో 56.67శాతం తక్కువ వానలు కురిశాయి. రబీకి కీలకమైన ఈ నెలల్లోనే వానలు లేకపోవడంతో సాగు తగ్గిపోయింది. డిసెంబరు మొదటివారంలో మిచౌంగ్ తుపాను ముంచేసింది. ఈ తర్వాత కూడా సరైన వానల్లేవు. మిచౌంగ్ తుఫాను ప్రభావంతో కురిసిన అతి భారీ వర్షాలు వేసిన శనగ పంటను తుడిచి పెట్టుకుపోయింది. మళ్లీ అదే పొలాల్లో తిరిగి శనగ సాగు చేయాల్సి వచ్చింది. దీంతో శనగ సాగు చేసిన రైతులు తీవ్రంగా నష్టపోయారు. రబీలో వరి తర్వాత ప్రధాన పంట మొక్కజొన్న ఈ పంట సాగు గణనీయంగా తగ్గింది. వరి సాధారణ విస్తీర్ణం 1,48,239 ఎకరాలు ఉంటే 25,790 ఎకరాల్లోనే సాగైంది. సాధారణంలో 17.39 శాతమే వరి సాగు చేశారు. సాగు నీరు సరఫరా లేకపోవడంతో కేవలం బావులు, బోర్లు, వాగుల కింద మాత్రమే వరి సాగు చేశారు. గత ఐదేళ్లలో పరిశీలించినా ఇంత తక్కువ విస్తీర్ణంలో వరి సాగు చేసిన దాఖలాలు లేవు.

పెరిగిన శనగ, పొగాకు సాగు...

రబీలో వరి తర్వాత ప్రధాన పంట మొక్కజొన్న మూడు జిల్లాల్లో సాధారణ విస్తీర్ణం 1,47,457 ఎకరాలు ఉంటే కేవలం 70,015 ఎకరాల్లోనే సాగు చేశారు. మొక్కజొన్న సాగు దారుణంగా పడిపో యింది. మిచౌంగ్ తుఫాను ప్రభావంతో కురిసిన వర్షాల అనంతరం నీరు అవసరం లేని శనగ పంటను రైతులు విస్తృతంగా సాగు చేశారు. శనగ సాగు గణనీయంగా పెరిగింది. శనగ సాధారణ విస్తీర్ణం 1,27,555 ఎకరాలు కాగా 1,37,648 ఎకరాల్లో సాగు చేశారు. ఈ పంట సాగు బాపట్ల జిల్లాలో భారీగా తగ్గగా గుంటూరు, పల్నాడు జిల్లాల్లో గణనీయంగా పెరిగింది. పొగాకు సాగు కూడా పెరిగింది. పొగాకు 21,515 ఎకరాలు సాధారణ విస్తీర్ణం కాగా 42,718 ఎకరాల్లో సాగు చేశారు. దాదాపు 21,203 ఎకరాల్లో పొగాకు సాగు పెరిగింది. బాపట్ల జిల్లాలో అత్యధికంగా పొగాకు సాగు పెరిగిందని వ్యవసాయ శాఖ అధికారులు తెలిపారు. వరి, మొక్కజొన్న పంటల సాగు భారీగా తగ్గగా శనగ, పొగాకు పంటలసాగు గణనీయంగా పెరిగింది.

పంటల సాగు వివరాలు ఎకరాల్లో..

జిల్లా	సాగు లక్ష్యం	విస్తీర్ణం	విస్తీర్ణం	శాతం
పల్నాడు	1,42087	1,35,340	80,792	60
గుంటూరు	1,82,082	1,70,590	1,31,395	67
బాపట్ల	3,89,112	3,68,047	2,76,540	66



నరసరావుపేట ప్రాంతంలో మొక్కజొన్న

నారీకి.. నిరాశే!



- అతివల ఓట్లే అధికం.. కానీ వారికేదీ అందలం!

- పురుషుల కంటే మహిళా ఓటర్లే అధికం
- రాజకీయ ప్రాధాన్యం మాత్రం లేదాయె
- మహిళలకు టిక్కెట్ నో అంటున్న పార్టీలు
- పార్టీలకు ఓటు బ్యాంకుగానే మహిళలు
- జిల్లా నుంచి ఐదుగురు మహిళలు ఎమ్మెల్యేలుగా ఎన్నిక

మహిళల సాధికారత కోసం కృషి చేస్తున్నామంటున్న పార్టీలు దానిని ఆచరణలో చూపడం లేదు. ఆయా పార్టీలు మహిళలను ఓటు బ్యాంకుగానే వినియోగించుకుంటున్నాయన్న విమర్శలున్నాయి. అతివలకు రాజకీయ ప్రాధాన్యం కల్పించేందుకు ఏ ఒక్క పార్టీ కృషి చేయడం లేదన్న అభిప్రాయం వారి నుంచి వ్యక్తమవుతోంది. ఇందుకు నిదర్శంగా రానున్న అసెంబ్లీ ఎన్నికలు నిలువ నున్నాయి. జిల్లాలో పురుషుల కంటే మహిళల ఓట్లు అధికంగా ఉన్నా ఏ ఒక్క పార్టీ వచ్చే ఎన్నికల్లో వారికి ఒక్క టిక్కెట్ కూడా ఇచ్చే పరిస్థితులు లేవు. పురుషుల కంటే మహిళల ఓట్లు 38,233 అధికంగా ఉన్నాయి. అయినా అతివలకు రాజకీయ అందలం కల్పించడం లేదు. 1983 నుంచి జరిగిన ఎన్నికలను పరిశీలిస్తే ఎనిమిది మంది మహిళా నేతలకు పోటీచేసే అవకాశం దక్కింది. వీరిలో ఐదుగురు మహిళా నేతలు ఎమ్మెల్యేలుగా ఎన్నికయ్యారు.

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

పల్నాడు జిల్లాలోని ఏడు అసెంబ్లీ సెగ్మెంట్లు, పార్లమెంట్ నియోజకవర్గంలో ప్రధాన పార్టీలు అభ్యర్థుల ఎంపికలో తలమునకలు అవుతున్నాయి. ఆయా పార్టీల అభ్యర్థుల కోసం పేర్లు పరిశీలిస్తున్నాయి. ఈ మేరకు సదరు పేర్లతో సర్వేలు కూడా చేయించాయి. ఈ జాబితాల్లో ఒక్క మహిళ పేరు కూడా లేకపోవడం గమనార్హం. టిక్కెట్ల కేటాయింపులో పార్టీలు కులాలు, మతాలను పరిగణనలోకి తీసుకుంటున్నారే తప్ప మహిళలను గుర్తించడం లేదన్న అభిప్రాయం వారి నుంచి వ్యక్తమవుతోంది. కుల సమీకరణల ద్వారా లబ్ధి పొందాలంటే ఏ కులం వారికి టిక్కెట్ ఇవ్వాలని కూడికలు తీసివేతలు వేస్తున్న పార్టీలకు కనీసం మహిళలు ఉన్నారన్న స్పృహ కూడా లేదని మహిళలు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. పార్లమెంట్ స్థానానికి దాదాపు అభ్యర్థులను ప్రధాన పార్టీలు ఖరారు చేశాయి. మహిళలకు ప్రాధాన్యం దక్కలేదు.

పురుషుల కంటే 38,233 మహిళల ఓట్లు అధికం..

ప్రధాన పార్టీలు నరసరావుపేట, చిలకలూరిపేట, సత్తెనపల్లి, పెదకూరపాడు, గురజాల, మాచర్ల, వినుకొండ నియోజకవర్గాలకు సంబంధించి పార్టీలు టిక్కెట్ ఆశిస్తున్న వారి పేర్లు పరిశీలనలోకి తీసుకున్నాయి. ఈ జాబితాలను పరిశీలిస్తే ఏ ఒక్క నియోజకవర్గంలో కూడా మహిళల అభ్యర్థిత్వాన్ని పరిశీలించలేదని తెలుస్తోంది. గత ఎన్నికల్లో మాత్రం ఒక్క మహిళకు మాత్రమే పోటీచేసే అవకాశం లభించింది. చిలకలూరిపేట నియోజకవర్గంలో వైసీపీ నుంచి విడదల రజని పోటీచేసి విజయం సాధించిన విషయం తెలిసిందే. వచ్చే ఎన్నికల్లో కూడా మహిళలను ఓటు బ్యాంకుగానే వినియోగించుకొన్నారే తప్ప వారికి పోటీచేసే అవకాశాన్ని పార్టీలు కల్పించే పరిస్థితి లేదని వారు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. తుది ఓటర్ల జాబితా ప్రకారం జిల్లాలో 17,12,829 ఓట్లు ఉన్నాయి. 8,37,200 మంది పురుషులు, 8,75,433 మంది మహిళలు ఓటర్లుగా ఉన్నారు. 38,233 మహిళల ఓట్లు పురుషుల కంటే అధికంగా ఉన్నాయి.

మహిళా ఎమ్మెల్యేలు ఐదుగురే..

జిల్లాలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గంలో 1983నాటి నుంచి జరిగిన ఎన్నికలను పరిశీలిస్తే ఐదుగురు మహిళా నేతలు ఎమ్మెల్యేలుగా ఎన్నికయ్యారు. 1983లో సత్తెనపల్లి, 1989లో వినుకొండ నుంచి నన్నపనేని రాజకుమారి ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. 1994లో వినుకొండ నుంచి పోటీచేసి నన్నపనేని ఓటమి చెందారు. సత్తెనపల్లి నుంచి టీడీపీ, వినుకొండ నుంచి కాంగ్రెస్ ఎమ్మెల్యేగా గెలుపొందారు. వినుకొండ నుంచి 2004లో గోనుగుంట్ల లీలావతి టీడీపీ నుంచి, 2014లో రాజకుమారి కుమార్తె నన్నపనేని సుధ వైసీపీ నుంచి పోటీ చేసి ఓటమి చెందారు. 1985లో సత్తెనపల్లి కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేసిన జేయూ పద్మలత ఓటమి చెందారు. 1994లో సీపీఎం అభ్యర్థిగా పోటీచేసిన పుతుంబాక భారతి గెలుపొందారు. చిలకలూరిపేట నియోజకవర్గం నుంచి పోటీచేసే అవకాశం ఇద్దరు మహిళలకు దక్కింది. వీరు ఇరువురు విజయం సాధించడం విశేషం. ఇక్కడ నుంచి 1989 ఎన్నికల్లో డాక్టర్ కందిమళ్ల జయమ్మ టీడీపీ నుంచి పోటీచేసి విజయం సాధించారు. 2019లో విడదల రజని వైసీపీ నుంచి పోటీ చేసి గెలుపొందారు. మాచర్ల నుంచి పోటీచేసే అవకాశం మహిళలకు ఒక్కసారి మాత్రమే దక్కింది. 1999 ఎన్నికల్లో టీడీపీ నుంచి జూలకంటి దుర్గాంబ పోటీచేసి గెలుపొం దారు. గురజాల, నరసరావుపేట, పెదకూరపాడు నియోజకవర్గాల నుంచి పోటీచేసే అవకాశం మహిళ లకు దక్కలేదు. నాదెండ్ల భాస్కరరావు మంత్రి వర్గంలో టూరిజం, సాంస్కృతిక శాఖ మంత్రిగా, కాంగ్రెస్ ప్రభుత్వంలో చీఫ్‌విప్‌గా రాజకుమారి పనిచేశారు. విడదల రజని ప్రస్తుతం వైద్య ఆరోగ్య శాఖ మంత్రిగా బాధ్యతలు నిర్వహిస్తున్నారు.

నియోజకవర్గాల వారీగా మహిళల ఓట్లు

నియోజకవర్గం	మహిళల ఓట్లు
పెదకూరపాడు	1,16,897
చిలకలూరిపేట	1,16,934
నరసరావుపేట	1,17,748
సత్తెనపల్లి	1,21,955
వినుకొండ	1,29,520
గురజాల	1,39,104
మాచర్ల	1,32,031
మొత్తం ఓట్లు	8,75,433

నిధుల కూత

- కేంద్ర బడ్జెట్‌లో గుంటూరుకు కేటాయింపు
- గుంటూరు - బీబీనగర్ డబ్లింగ్‌కు రూ.200 కోట్లు
- నడికుడి-శ్రీకాళహస్తి, గుంటూరు-గుంతకల్లు మార్గాలకూ నిధులు
- మల్టీ ట్రాకింగ్ కనెక్టివిటీ నిమిత్తం గుంటూరు జంక్షన్‌కు రూ.50 కోట్లు

గుంటూరు, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): 2024-25 ఆర్థిక సంవత్సరానికి కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో గుంటూరు రైల్వే డివిజన్‌కి పెద్ద మొత్తంలోనే కేటాయింపులు జరిగాయి. దశాబ్దాల కల అయిన గుంటూరు - బీబీనగర్ డబ్లింగ్ ప్రాజెక్టుని గత ఏడాది గతి శక్తి స్కీమ్ కింద ప్రకటించిన కేంద్రం ఈ బడ్జెట్‌లో నిధులు కేటాయించి నిర్మాణం ప్రారంభించేందుకు మార్గం సుగమం చేసింది. అలానే నిర్మాణ దశలో కొనసాగుతున్న నడికుడి - శ్రీకాళహస్తి సింగిల్ లేన్, గుంటూరు - గుంతకల్లు రెండో రైలు మార్గం ప్రాజెక్టులకు ఆశాజనకంగా నిధులు కేటాయించింది. కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మల సీతారామన్ ఎన్నికలకు ముందు ఓట్ ఆన్ అకౌంట్ బడ్జెట్‌ని గురువారం పార్లమెంట్‌లో ప్రవేశపెట్టిన విషయం తెలిసిందే. ఈ బడ్జెట్‌లో గుంటూరు రైల్వే డివిజన్‌కి జరిగిన కేటాయింపులు ఆశాజనకంగానే ఉన్నాయి. రైళ్ల పునరుద్ధరణ, పెరిగిన సరుకు రవాణాతో నడికుడి రైలుమార్గం రద్దీగా మారిపోయింది. ఈ నేపథ్యంలో రైళ్ల క్రాసింగ్ సమస్యలు ఎదుర్కొంటున్నాయి. దీని వల్ల గమ్యస్థానాలకు కొంత ఆలస్యంగా చేరుతున్నాయి. ఈ నేపథ్యంలో గత ఏడాది కేంద్ర ప్రభుత్వం గుంటూరు - బీబీనగర్ డబ్లింగ్ ప్రాజెక్టుని మంజూరు చేసింది. 248 కిలోమీటర్ల పొడవునా నిర్మించాల్సి ఉన్నా ఈ రెండో రైలుమార్గం కోసం రూ.2,853.23 కోట్ల నిధులు అవసరం అవుతాయని అంచనా వేసింది. కాగా ఈ బడ్జెట్‌లో రూ.200 కోట్లు కేటాయించడం ద్వారా నిర్మాణ పనులకు అడుగులు పడే వాతావరణాన్ని ఆర్థిక మంత్రి కల్పించారు.

ఇక పనులు వేగవంతం..

గుంటూరు - గుంతకల్లు రెండో రైలు మార్గం, నడికుడి - శ్రీకాళహస్తి నూతన రైలుమార్గం పనులు కొన్నేళ్లుగా నిర్మాణం జరుగుతోన్నాయి. నడికుడి - శ్రీకాళహస్తి రైలు మార్గానికి ఈ బడ్జెట్‌లో మూలధనం కింద రూ.150 కోట్లు, సేఫ్టీ ఫండ్ కింద మరో రూ.300 కోట్లు కేటాయింపులు జరిపింది. గుంటూరు - గుంతకల్లు డబ్లింగ్‌కు పెండింగ్ పనులు ఉండగా వాటిని పూర్తి చేసేందుకు రూ.283.50 కోట్లు ఈ బడ్జెట్‌లో పొందుపరిచింది. తద్వారా ఈ రెండు రైలు మార్గాల పనులను మరింత ముందుకు తీసుకెళ్లబోతోన్నామన్న సంకేతాలను కేంద్ర ప్రభుత్వం పంపింది. విష్ణుపురం వద్ద బైపాసు లైను 4.90 కిలోమీటర్ల పొడవునా నిర్మాణానికి రూ.20 కోట్లు కేటాయించింది. గుంటూరు రైల్వే జంక్షన్‌లో మల్టీ ట్రాకింగ్ కనెక్టివిటీ కోసం రూ.50 కోట్లు మంజూరు చేసింది. తద్వారా భవిష్యత్‌లో గుంటూరు - గుంతకల్లు, గుంటూరు - బీబీనగర్ డబ్లింగ్ ప్రాజెక్టులు పూర్తి అయితే ఇక్కడ రైళ్ల రాకపోకలకు ఆటంకాలు లేకుండా ఉంటుందని రైల్వేవర్గాలు చెబుతున్నాయి.

అమరావతిపై మారని తీరు

అమరావతే ఆంధ్రప్రదేశ్ రాజధాని అని కుండబద్ధలు కొట్టి చెబుతున్న బీజేపీ మరోవైపు నిధుల కేటాయింపు వచ్చేసరికి సవతితల్లి ప్రేమను చూపుతోంది. రాష్ట్ర ప్రజల ఆకాంక్ష అయిన అమరావతి రాజధానికి రైలుమార్గం ప్రాజెక్టుకి ఈ బడ్జెట్‌లో కూడా మొండిచెయ్యే చూపించింది. విజయవాడ - గుంటూరు వయా అమరావతి 106 కిలోమీటర్ల రైలు మార్గానికి రూ.2,679.59 కోట్ల నిధులు అవసరమౌతాయని అంచనా వేశారు. ఈ ప్రాజెక్టుకి సంబంధించి సర్వే, డీపీఆర్ కూడా ఎప్పుడో సిద్ధమైంది. అయితే నిధులు, భూమిని రాష్ట్ర ప్రభుత్వం భరించాలని కేంద్రం షరతు పెట్టడంతో ఈ ప్రాజెక్టు పెండింగ్‌లో పడింది. కనీసం ఎన్నికల సంవత్సరంలోనైనా కొంత నిధులు కేటాయించి రైలుమార్గం నిర్మాణానికి అడుగులు పడేలా చేస్తుందని అంతా ఆశలు పెట్టుకున్నారు. అయితే ఎప్పటిలానే ఈ ఏడాది కూడా బీజేపీ పాలిత ఎన్‌డీఏ ప్రభుత్వం మొండి చెయ్యే చూపించింది.



8న ఛలో విజయవాడ

డీఎంహెచ్‌వోకు ఆశా వర్కర్స్ నోటీసు

నరసరావుపేట టౌన్, ఫిబ్రవరి 2: ఆశాల సమస్యల పరిష్కారం కోసం 8న ఛలో విజయవాడ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఏపీ ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి డీ శివకుమారి తెలిపారు. ఈ మేరకు శుక్రవారం డీఎంహెచ్‌వో కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా శివకుమారి మాట్లాడుతూ ఆశా వర్కర్లకు కనీస వేతనం చెల్లించాలని, సంబంధం లేని పనులు చేయించరాదని, నాణ్యమైన సెల్‌ఫోన్లు ఇవ్వాలని, రికార్డులను ప్రభుత్వమే ఇవ్వాలన్నారు. ఉద్యోగ విరమణ బెనిఫిట్స్ రూ.5 లక్షలు ఇవ్వాలని, వేతనంలో సగం పెన్షన్‌గా ఇవ్వాలని, ఏ కారణంతోనైనా మరణిస్తే రూ.10 లక్షలు గ్రూప్ ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించాలని, మట్టి ఖర్చులు ఇవ్వాలన్నారు. రిటైరైన, మరణించిన ఆశాల కుటుంబాలలో అర్హులైన వారిని ఆశాలుగా తీసుకోవాలని కోరారు. ప్రభుత్వ సెలవులు, మెడికల్ లీవ్, వేతనంతో కూడిన మెటర్నిటీ లీవ్‌లు అమలు చేయాలని, 62 ఏళ్ల రిటైర్మెంట్ జీవోను ఆశాలకు కూడా వర్తింపచేయాలన్నారు. కోవిడ్ కాలంలో మరణించిన ఆశాలకు రూ.10 లక్షలు ఎక్స్‌గ్రేషియో ఇవ్వాలని, గ్రామాల్లో వేయి నుంచి 12 వందలు, పట్టణాలలో 2 వేల నుంచి 25 వందల జనాభాకు ఒక ఆశాను నియమించాలన్నారు. ఖాళీ పోస్టులను భర్తీ చేయాలని, నియామకాలను ప్రభుత్వమే చేపట్టాలని, రాజకీయ జోక్యం తొలగించాలన్నారు. ఏఎన్ఎం, జీఎన్ఎం ట్రైనింగ్ పొందిన వర్కర్లకు ఆయా ఉద్యోగ నియామకాలలో వేయిటేజి ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఆశాలకు ఏఎన్ఎం శిక్షణ ఇవ్వాలన్నారు. ఆయా సమస్యల పరిష్కారం కోసం ఛలో విజయవాడ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఈ స్వప్న, పీ రాజ్యలక్ష్మి, బీ శ్రావణి, కే యామిని, ఎం హేమలత తదితరులు పాల్గొన్నారు.



నోటీసులు అందిస్తున్న ఏపీ ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి డీ శివకుమారి

రైతుల ప్రత్యామ్నాయ ప్లాట్లపై

అపోహలు వద్దు

- ఏపీ సీఆర్‌డీఏ స్పెషల్ ల్యాండ్స్ కలెక్టర్

పదో తరగతి విద్యార్థిని ఆత్మహత్య

- డ్రైవర్ వేధింపులే కారణం?

7లో..

దిక్సూచి DIKSUCHI

ఏపీపీఎస్సీ/టీఎస్పీఎస్సీ పరీక్షల ప్రత్యేకం
ఇండియన్ జాగ్రఫీ

సాంప్రదాయేతర శక్తి వనరులు

సాంప్రదాయేతర శక్తి వనరులు ఎల్లప్పుడూ లభ్యమవుతాయి. అందువల్ల వీటిని పునరుద్ధరణ(Renewable) శక్తి వనరులు అంటారు. వీటిని ప్రత్యామ్నాయ శక్తి వనరులు అని కూడా అంటారు. ప్రత్యామ్నాయ శక్తి వనరులకు ఉదాహరణలు..

- జల విద్యుత్ శక్తి(Hydro Electricity)
- సౌర శక్తి(Solar Energy)
- పవన శక్తి(Wind Energy)
- అలల శక్తి(Wave Energy)
- వేలాతరంగా శక్తి(Tidal Energy)
- భూతాప శక్తి(Geothermal Energy)



- బయోమాస్(Biomas)
- OTEC(Ocean Thermal Energy Convertion)

1981లో ప్రత్యామ్నాయ శక్తి వనరులను అభివృద్ధి చేసేందుకు భారత ప్రభుత్వం DNES (Departmen of Conventional Energy Sources) అనే సంస్థను ఏర్పాటు చేసింది.

జల విద్యుత్: 2019 నాటికి మన దేశంలో మొత్తం జల విద్యుత్ ఉత్పత్తి- 45,293 మెగా వాట్లు. జలవిద్యుత్ ఉత్పత్తిలో పంజాబ్, కర్ణాటక అగ్ర స్థానాల్లో ఉన్నాయి. జల విద్యుత్ ఉత్పత్తికి 1975లో నేషనల్ హైడ్రో పవర్ కార్పొరేషన్‌ను ఏర్పాటు చేశారు. మధ్యప్రదేశ్‌లోని ఇందిరాసాగర్ దేశంలో అత్యధిక జల విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యం కలిగిన ప్రాజెక్టు. దేశంలో మొదటిసారిగా జల విద్యుత్‌ను జనరేటర్ల సహాయంతో 1889లో పశ్చిమ బెంగాల్‌లోని డార్జిలింగ్ ప్రాంతంలో గల 'లోనాపల' వద్ద ఉత్పత్తి చేశారు. మొట్టమొదట జల విద్యుత్ కేంద్రాన్ని 1902లో కర్ణాటకలోని మైసూర్ వద్ద ఉన్న శివన్నసముద్రం వద్ద కావేరీ నదిపై నిర్మించారు. ఈ జల విద్యుత్ కేంద్రం కర్ణాటకలోని కోలార్ బంగారు గనికి విద్యుత్‌ను సరఫరా చేస్తుంది. దేశంలో అత్యంత ఎత్తుగల జలవిద్యుత్ కేంద్రం - నాత్పా జాక్రీ(హిమాచల్ ప్రదేశ్). కేరళ 100 శాతం జల విద్యుత్ పైనే ఆధారపడ్డది. జల విద్యుత్‌ను తెల్ల బొగ్గు అని కూడా అంటారు. ప్రపంచ జల విద్యుత్ ఉత్పత్తిలో మనదేశం ఆరో స్థానంలో, చైనా మొదటి స్థానంలో ఉన్నాయి. ప్రపంచంలో అతిపెద్ద జల విద్యుత్ కేంద్రం త్రీ గార్జెస్. దీని ఉత్పత్తి సామర్థ్యం 22,500 మెగావాట్లు. ప్రపంచంలోనే రెండో అతిపెద్ద జల విద్యుత్ కేంద్రాన్ని బ్రెజిల్‌లోని ఇటైపు వద్ద నిర్మించారు. దీని సామర్థ్యం 14,000 మెగా వాట్లు.

సౌర శక్తి: 2019 నాటికి మొత్తం సౌర విద్యుత్ స్థాపిత సామర్థ్యం 28,180.71 మెగా వాట్లు. సౌర విద్యుత్ స్థాపిత సామర్థ్యం అధికంగా గల రాష్ట్రాలు కర్ణాటక, తెలంగాణ. కొచ్చి(కేరళ) విమానాశ్రయం సౌర విద్యుత్‌తో నడుస్తోంది. 2020 జూన్‌లో ఆసియాలోనే అతిపెద్ద సోలార్ ప్లాంట్‌ను మధ్యప్రదేశ్‌లోని 'రివా'లో ప్రారంభించారు. దీనిని 500 హెక్టార్ల విస్తీర్ణంలో 700 మెగావాట్ల సామర్థ్యంతో నిర్మించారు. ప్రపంచంలో అతిపెద్ద సోలార్ బాయిలర్‌ను 2009లో షిరిడీలో ఏర్పాటు చేశారు. దీనిని ఉపయోగించి ప్రతి రోజూ 50,000 మందికి ఆహారపదార్థాలు వండవచ్చు. తిరుమలలో 15000 మందికి ఆహారపదార్థాలు వండగలిగే సోలార్ బాయిలర్ ఉంది. దిల్‌షుక్‌నగర్(హైదరాబాద్)లోని సాయిబాబా గుడిలో 3000 మందికి ఆహారపదార్థాలు వండగలిగే సోలార్ బాయిలర్ ఉంది. సౌర శక్తి ఉత్పత్తిలో అమెరికా, జర్మనీ, చైనా, జపాన్ వరుస స్థానాల్లో ఉన్నాయి. భారత్ ఎనిమిదో స్థానం లో ఉంది. మొట్టమొదట సౌరశక్తి కేంద్రం జమ్మూ కశ్మీర్‌లోని చొగ్లాంసర్ వద్ద నిర్మించారు. ఆసియాలో నే అతిపెద్ద సౌర తటాకం(Solar Pond) గుజరాత్‌లోని భుజ్ వద్ద ఉంది.

పవన శక్తి: దేశ పవన శక్తి ఉత్పత్తి సామర్థ్యం 35,625 మెగావాట్లు. ప్రపంచంలో పవన శక్తి ఉత్పత్తిలో చైనా మొదటి, భారత్ నాలుగో స్థానాల్లో ఉన్నాయి. దేశంలో పవన శక్తి ఉత్పత్తిలో తమిళనాడు, గుజరాత్, మహారాష్ట్ర వరుస స్థానాల్లో ఉన్నాయి. భారతదేశంలో పవన విద్యుత్‌ను ఎక్కువగా ఉపయోగించుకుంటున్న ప్రాంతం జోగిమట్టి(కర్ణాటక). దేశంలో మొట్టమొదటి పవన శక్తి కేంద్రాన్ని గుజరాత్‌లోని మాండవి వద్ద 1986లో నిర్మించారు. దేశంలో అతిపెద్ద శక్తి కేంద్రం తమిళనాడులోని ముప్పాండల్ వద్ద ఉంది.

అలల శక్తి: మొట్ట మొదటి అలల శక్తి కేంద్రాన్ని కేరళలోని తిరువనంతపురం వద్ద గల విజింజీం వద్ద నిర్మించారు.

వేలాతరంగ శక్తి: ఆసియాలోనే మొట్టమొదటి వేలాతరంగ విద్యుత్ కేంద్రం గుజరాత్‌లోని కాండ్లా వద్ద నిర్మించారు. వేలాతరంగ విద్యుత్ ఉత్పత్తికి అనుకూలమైన ప్రాంతాలు- గల్ఫ్ ఆఫ్ కచ్(1200 మెగావాట్లు), గల్ఫ్ ఆఫ్ కంబట్(7000 మెగావాట్లు), సుందర్ బన్స్.

భూతాప శక్తి: భారతదేశంలో ఏకైక భూతాప శక్తి కేంద్రం హిమాచల్ ప్రదేశ్‌లోని 'మణికరణ్' వద్ద ఉంది. జమ్మూ కశ్మీర్‌లోని లడఖ్‌లో గల పూగా లోయ కూడా భూతాపశక్తి ఉత్పత్తికి అనుకూలమైంది. భారత్‌లో 45,000 మెగా వాట్లు జియో థర్మల్ ఉత్పత్తికి అవకాశం ఉంది.

బయోమాస్: దీనిని వ్యర్థ పదార్థాల నుంచి ఉత్పత్తి చేస్తారు. మొట్ట మొదటి బయోమాస్ విద్యుత్ కేంద్రం పంజాబ్‌లోని జలంధర్ వద్ద నిర్మించారు. బయోమాస్‌లో 60 శాతం మీథేన్, 40 శాతం కార్బన్ డై ఆక్సైడ్ ఉంటాయి.

OTEC(Ocean Thermal Energy Convertion): దీనిని సముద్రపు నీటి ఉష్ణోగ్రతల వ్యత్యాసం ఆధారంగా ఉత్పత్తి చేస్తారు. ప్రపంచంలోనే మొట్టమొదటి OTEC కేంద్రం తమిళనాడులోని ట్యూటికోరిన్ వద్ద అమెరికా సహాయంతో నిర్మించారు. ప్రస్తుతం భారతదేశంలో ఐదు ప్రాంతీయ గ్రిడ్స్ ఉన్నాయి.



వి.వెంకటరెడ్డి,
సీనియర్ ఫ్యాకల్టీ.

నిట్ వరంగల్‌లో ఆన్‌లైన్ ఎఫ్‌డీపీ



వరంగల్‌లోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ(నిట్ వరంగల్)- ఆన్‌లైన్ ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్(ఎఫ్‌డీపీ)లలో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. ఈ ప్రోగ్రామ్‌లను కేంద్ర ఎలక్ట్రానిక్స్ అండ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ మంత్రిత్వ శాఖ స్పాన్సర్ చేస్తోంది.

ఒక్కో ప్రోగ్రామ్ వ్యవధి 12 రోజులు. ప్రతి ప్రోగ్రామ్‌లో 100 సీట్లు ఉన్నాయి. ఫస్ట్ కం ఫస్ట్ సర్వ్ పద్ధతిలో అభ్యర్థులకు అవకాశం కల్పిస్తారు. ఐఐటీలు, ఐఐఐటీలు, నిట్ సంస్థల్లో పనిచేస్తున్న ఫ్యాకల్టీ మెంబర్లు సెషన్స్ నిర్వహిస్తారు. ఇంజనీరింగ్/ఎంసీఏ కాలేజీల ఫ్యాకల్టీలు, ఇండస్ట్రీ ప్రొఫెషనల్స్, పీజీ చదువుతున్నవారు, పీహెచ్‌డీ అభ్యర్థులు రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చు.

స్మార్ట్ కాంట్రాక్ట్ మాస్టరీ:పయనీరింగ్ ద ఫ్యూచర్ ఆఫ్ బ్లాక్ చెయిన్ అప్లికేషన్స్

సంస్థ ఆధ్వర్యంలోని సీఎస్‌ఈ డిపార్ట్‌మెంట్, ఈ&ఐసీటీ అకాడమీలు ఈ ప్రోగ్రామ్‌ని నిర్వహిస్తున్నాయి. ఇందులో బ్లాక్ చెయిన్-కరెంట్ అండ్ ఫ్యూచర్ అప్లికేషన్స్, ఇన్ఫర్మేషన్ అటెస్టేషన్ అండ్ మల్టీ ప్రొటోకాల్ స్టోరేజ్ ఫర్ వెబ్, బ్లాక్ చెయిన్-క్వెరీ లాంగ్వేజ్, బిజినెస్ నెట్‌వర్క్స్ అండ్ ప్రాసెస్ బేస్డ్ ఆన్ మోడలింగ్ అండ్ బ్లాక్ చెయిన్ తదితర అంశాలు వివరిస్తారు. టెస్టింగ్ టూల్స్‌కు సంబంధించి ప్రాక్టికల్ సెషన్స్ ఉంటాయి.

- **ప్రోగ్రామ్ వ్యవధి:** మార్చి 25 నుంచి ఏప్రిల్ 5 వరకు
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** మార్చి 20

ఆప్టిమైజేషన్ టెక్నిక్ ఫర్ ఇంజనీరింగ్ అప్లికేషన్స్

ఈ ప్రోగ్రామ్‌ని సంస్థ ఆధ్వర్యంలోని ఈ&ఐసీటీ అకాడమీ నిర్వహిస్తోంది. ఇందులో డైరెక్ట్ సెర్చ్ మెథడ్స్, గ్రేడియంట్ బేస్డ్ మెథడ్స్, సింపుల్ మెథడ్ అండ్ లీనియర్ ప్రోగ్రామింగ్, జెనెటిక్ అల్గారిథమ్, పార్టికల్ ఆప్టిమైజేషన్, డిఫరెన్షియల్ ఎవల్యూషన్, కాలనీ ఆప్టిమైజేషన్ అల్గారిథమ్, సిమ్యులేటెడ్ ఎనీలింగ్ అల్గారిథమ్ తదితర అంశాలు వివరిస్తారు. సాఫ్ట్ కంప్యూటింగ్, మెటా ఆప్టిమైజేషన్ అల్గారిథమ్‌లకు సంబంధించిన కేస్ స్టడీస్ ఉంటాయి.

- **ప్రోగ్రామ్ వ్యవధి:** మార్చి 11 నుంచి 22 వరకు
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** మార్చి 5
- **దరఖాస్తు ఫీజు:** రూ.1000
- **వెబ్‌సైట్:** nitw.ac.in

నార్మ్‌లో పీజీడీఎం అగ్రిబిజినెస్ మేనేజ్‌మెంట్

హైదరాబాద్-రాజేంద్రనగర్‌లోని ఐకార్ - నేషనల్ అకాడమీ ఆఫ్ అగ్రికల్చరల్ రీసెర్చ్ మేనేజ్‌మెంట్ (నార్మ్)- 'పోస్ట్ గ్రాడ్యుయేట్ డిప్లొమా ఇన్ మేనేజ్‌మెంట్(అగ్రిబిజినెస్ మేనేజ్‌మెంట్)' ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి నోటిఫికేషన్ విడుదల చేసింది. ఇది రెండేళ్ల వ్యవధి గల రెసిడెన్షియల్ ప్రోగ్రామ్. ఇందులో ఆరు ట్రైమెస్టర్లు ఉంటాయి. ప్రోగ్రామ్‌లో భాగంగా ఆరు నుంచి ఎనిమిది వారాల సమ్మర్ ఇంటర్న్‌షిప్, 12 వారాల బిజినెస్ బూట్ క్యాంప్, 13 వారాల ప్రాజెక్ట్ వర్క్ ఉంటాయి. ఇందులో మొత్తం 66 సీట్లు ఉన్నాయి. కేంద్ర ప్రభుత్వ నిబంధనల మేరకు రిజర్వేషన్‌లు వర్తిస్తాయి. దీనికి ఏఐసీటీఈ గుర్తింపు ఉంది.

అర్హత: యూజీసీ గుర్తింపు పొందిన కళాశాల నుంచి అగ్రికల్చర్, అగ్రి బిజినెస్ మేనేజ్‌మెంట్, కమర్షియల్ అగ్రికల్చర్, అగ్రికల్చరల్ మార్కెటింగ్ అండ్ కోఆపరేషన్, అగ్రికల్చరల్ ఇంజనీరింగ్, అగ్రికల్చరల్ బయోటెక్నాలజీ, డెయిరీ సైన్స్/టెక్నాలజీ, ఫిషరీస్, ఫుడ్ టెక్నాలజీ/ఫుడ్ ప్రాసెస్ ఇంజనీరింగ్, ఫారెస్ట్రీ, హార్టికల్చర్, సెరికల్చర్, వెటర్నరీ సైన్స్, హోమ్ సైన్స్/కమ్యూనిటీ సైన్స్, అగ్రికల్చరల్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ విభాగాలకు సంబంధించి ఒకదానిలో నాలుగేళ్ల డిగ్రీ ఉత్తీర్ణులై ఉండాలి. పదోతరగతి నుంచి డిగ్రీ స్థాయి వరకు ప్రథమ శ్రేణి మార్కులు ఉండాలి. ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు అయిదు శాతం సడలింపు వర్తిస్తుంది. క్యాట్ 2023/సీమ్యాట్ 2024 స్కోర్ తప్పనిసరి. సంబంధిత రంగంలో కనీసం ఆర్నెల్ల అనుభవం ఉన్నవారికి ప్రాధాన్యం ఉంటుంది.

- **దరఖాస్తు ఫీజు:** జనరల్ అభ్యర్థులకు రూ.2,000; ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ.1000
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** ఫిబ్రవరి 29
- **వెబ్‌సైట్:** naarm.org.in/

'దిక్సూచి' వెబ్ పేజీలో..
సమాచారం కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.
లేదా ఈ కింది యూఆర్ఎల్ https://ejyothy.com/K1ylmt7లో చదవండి.

ఐఐఎం రోహ్‌తక్‌లో ఐపీఎం

రోహ్‌తక్‌లోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్(ఐఐఎం)- ఇంటిగ్రేటెడ్ ప్రోగ్రామ్ ఇన్ మేనేజ్‌మెంట్ (ఐపీఎం)లో ప్రవేశానికి నోటిఫికేషన్ విడుదల చేసింది. ఇది అయిదేళ్ల వ్యవధిగల రెసిడెన్షియల్ ప్రోగ్రామ్. బిజినెస్ మేనేజ్‌మెంట్ విభాగాల్లో రాణించాలనుకొనే వారికి ఈ ప్రోగ్రామ్ అనువుగా ఉంటుంది. ఐపీఎం ఆప్టిట్యూడ్ టెస్ట్(ఐపీఎం ఏటీ) 2024, పర్సనల్ ఇంటర్వ్యూ, అకడమిక్ ప్రతిభ ఆధారంగా ప్రవేశాలు కల్పిస్తారు. మొత్తం 165 సీట్లు ఉన్నాయి. మొదటి మూడేళ్ల తరవాత ప్రోగ్రామ్ నుంచి వైదొలగే వీలుంది. వీరికి బీబీఏ(బ్యాచిలర్ ఆఫ్ బిజినెస్ అడ్మినిస్ట్రేషన్) డిగ్రీని ప్రదానం చేస్తారు. ప్రోగ్రామ్ మొత్తం పూర్తిచేసిన వారికి ఎంబీఏ డిగ్రీ ఇస్తారు. క్యాంపస్ ప్లేస్‌మెంట్ సౌకర్యం ఉంది.

అర్హత: గుర్తింపు పొందిన బోర్డ్ నుంచి ఏదేని గ్రూప్‌తో ఇంటర్/పన్నెండో తరగతి/తత్సమాన కోర్సు ఉత్తీర్ణులై ఉండాలి. పదోతరగతి, ఇంటర్ స్థాయుల్లో జనరల్ అభ్యర్థులకు ప్రథమ శ్రేణి మార్కులు; దివ్యాంగులు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు కనీసం 55 శాతం మార్కులు ఉండాలి. ప్రస్తుతం చివరి సంవత్సర పరీక్షలకు సన్నద్ధమౌతున్న వారు కూడా అప్లయ్ చేసుకోవచ్చు. అభ్యర్థుల వయసు 2024 జూన్ 30 నాటికి 20 ఏళ్లు మించకూడదు.

ఐపీఎం ఆప్టిట్యూడ్ టెస్ట్ (ఐపీఎం ఏటీ) 2024 వివరాలు: దీనిని ఆబ్జెక్టివ్ విధానంలో నిర్వహిస్తారు. ఇందులో క్వాంటిటేటివ్ ఎబిలిటీ, లాజికల్ రీజనింగ్, వెర్బల్ ఎబిలిటీ అనే మూడు సెక్షన్‌లు ఉంటాయి. ఒక్కో సెక్షన్‌లో 40 మల్టిపుల్ చాయిస్ ప్రశ్నలు అడుగుతారు. ఒక్కో ప్రశ్నకు నాలుగు మార్కులు కేటాయించారు. సమాధానాన్ని తప్పుగా గుర్తిస్తే ఒక మార్కు కోత విధిస్తారు. సెక్షన్‌కు 40 నిమిషాలు చొప్పున మొత్తం పరీక్ష సమయం రెండు గంటలు.

- **ఆన్‌లైన్ దరఖాస్తు ప్రక్రియ ప్రారంభం:** ఫిబ్రవరి 6 నుంచి
- **దరఖాస్తు ఫీజు:** రూ.4,500
- **దరఖాస్తుకు చివరి తేదీ:** ఏప్రిల్ 10
- **ఐపీఎం ఆప్టిట్యూడ్ టెస్ట్ 2024:** మే 18 నుంచి
- **వెబ్‌సైట్:** iimrohtak.ac.in

నవ్య | చిత్రజ్యోతి

2025
జనవరి 10న విశ్వంభర



మెగాస్టార్ చిరంజీవి నటిస్తున్న తాజా చిత్రం 'విశ్వంభర'. ఈ సినిమా టైటిల్ టీజర్‌తోనే ప్రపంచ వ్యాప్తంగా ఉన్న తన అభిమానుల్ని, ప్రేక్షకుల్ని అలరించారు చిరంజీవి. 'బింబిసార' చిత్ర దర్శకుడు వశిష్ట దర్శకత్వంలో రూపుదిద్దుకుంటున్న ఈ మెగా ఫాంటసీ అడ్వెంచర్ కోసం 13 భారీ సెట్స్‌తో కొత్త ప్రపంచం సృష్టించారు. ఈ సినిమా షూటింగ్‌లో మెగాస్టార్ శుక్రవారం అడుగుపెట్టారు. హైదరాబాద్‌లో వేసిన భారీ సెట్‌లో ప్రస్తుతం షూటింగ్ జరుగుతోంది. యూవీ క్రియేషన్స్ పతాకంపై విక్రమ్, వంశీ, ప్రమోద్ అత్యంత భారీ బడ్జెట్‌తో 'విశ్వంభర' చిత్రాన్ని నిర్మిస్తున్నారు. మెగాస్టార్ చిరంజీవి ఇప్పటివరకూ నటించిన చిత్రాల్లో ఇదే కాస్ట్లీయస్ట్ ఫిల్మ్. వచ్చే సంక్రాంతి సందర్భంగా జనవరి 10న 'విశ్వంభర'ను విడుదల చేస్తామని నిర్మాతలు ప్రకటించారు. ఈ చిత్రానికి సాహిత్యం: శివశక్తి దత్తా, చంద్రబోస్, సంగీతం: కీరవాణి, ఛాయాగ్రహణం: చోటా కె నాయుడు, ఎడిటింగ్: కోటగిరి వెంకటేశ్వరావు, సంతోష్ కామిరెడ్డి.

అర్థం చేసుకొనే లైఫ్ పార్టనర్ ఉన్నాడు

లావణ్య



'వరుణ్‌తేజ్‌తో పెళ్లయిన తర్వాత కెరీర్ పరంగా ఏమీ మార్పు లేదు.. మెగా కుటుంబంలోకి వచ్చాక 'నువ్వు ఇలా చేయాలి.. అలా చేయాలి' అని ఎవరూ నాకు చెప్ప లేదు. కెరీర్ పరంగా నాకు కావాల్సినంత స్వేచ్ఛ ఉంది. వరుణ్ లాంటి అర్థం చేసుకొనే లైఫ్ పార్టనర్ ఉన్నాడు. మా వరకూ గతంలో లాగానే ఉన్నాం. ఒక పెద్ద ఫ్యామిలీలోకి అడుగుపెట్టడం మంచి అనుభూతినిచ్చింది. వరుణ్, నేను ఎవరి ప్రొఫెషనల్ వర్క్‌లో వాళ్లం ముందుకు వెళ్తాం. నేను చేసే ప్రాజెక్ట్‌లో వరుణ్ ఇన్‌వాల్వ్ కాడు. 'మిస్ పర్ఫెక్ట్ స్క్రిప్ట్ చదివి బాగుందన్నాడు' అని చెప్పారు లావణ్య. తను హీరోయిన్‌గా నటించిన వెబ్ సిరీస్ 'మిస్ పర్ఫెక్ట్' డిస్నీ హాట్ స్టార్‌లో స్ట్రీమింగ్ అవుతున్న సందర్భంగా ఆమె మీడియాతో ముచ్చటించారు.

- 'ఈ సిరీస్‌లో మంచి నటులు ఉన్నారు. రొమాంటిక్, కామెడీ ఎలిమెంట్స్ బ్లెండ్ చేసిన మంచి స్క్రిప్ట్ ఇది. ఇలాంటి స్క్రిప్ట్ నా దగ్గరకు రావడం హ్యాపీగా ఉంది. ఇందులో నేను 'మిస్ లావణ్య, లక్ష్మి' అనే పాత్రలు చేశాను. అన్ని రకాల ఎమోషన్స్ ఈ పాత్రల్లో ఉన్నాయి. నా పర్సనల్ లైఫ్‌కు దగ్గరగా ఉండే పాత్రలివి. సినిమాలకు, వెబ్ సిరీస్‌కు పెద్ద తేడా కనిపించలేదు. సినిమా షూటింగ్ జరిగినట్టే ఈ వెబ్ సిరీస్ వర్క్ కూడా జరిగింది' అని చెప్పారు లావణ్య
- కొత్త దర్శకులతో పని చేయడం ఎప్పుడూ రిఫ్రెషింగ్‌గా ఉంటుంది. మా దర్శకుడు విశ్వక్ ఖండేరావు రైటింగ్ యూనిక్‌గా ఉంటుంది. అతనితో వర్క్ చేయడం ఆనందంగా ఉంది. సెట్‌లో ఎవరు సలహా చెప్పినా స్వీకరించేవారు. పర్ఫెక్షనిస్ట్‌గా ఉండడం వల్ల ఎన్ని సమస్యలు వస్తాయో ఈ సిరీస్‌లో చూస్తారు' అని ఆమె అన్నారు. నిర్మాత సుప్రియ తనకు మంచి స్నేహితురాలు కావడంతో ఈ సిరీస్ కంఫర్ట్‌గా చేశానని చెప్పారు. పీపుల్ మీడియా ఫ్యాక్టరీ ఓ కొత్త హీరోతో నిర్మించే చిత్రంలో నటించనున్నట్లు లావణ్య చెప్పారు. ఇందులో తనది పోలీస్ ఆఫీసర్ పాత్ర అన్నారు. దీంతో పాటు ఒక తమిళ సినిమా కూడా చేస్తున్నట్లు వెల్లడించారు.

వేసవిలో వస్తున్న ఫ్యామిలీ స్టార్



విజయ్ దేవరకొండ నటిస్తున్న 'ఫ్యామిలీ స్టార్' చిత్రం విడుదల తేదీని చిత్ర యూనిట్ శుక్రవారం ప్రకటించింది. ఏప్రిల్ 5న ఈ సినిమాను గ్రాండ్‌గా రిలీజ్ చేస్తున్నట్లు వెల్లడించారు. పరశురామ్ పెట్ల దర్శకత్వంలో దిల్ రాజు, శిరీష్ నిర్మిస్తున్నారు. మృణాల్ ఠాకూర్ హీరోయిన్‌గా నటిస్తున్న ఈ చిత్రానికి క్రియేటివ్ ప్రొడ్యూసర్‌గా వాసు వర్మ ఉన్నారు. రిలీజ్ డేట్ ప్రకటించిన సందర్భంగా స్పెషల్ పోస్టర్ విడుదల చేశారు. ఈ పోస్టర్‌లో విజయ్ మిడిల్ క్లాస్ ఫ్యామిలీ మ్యాన్‌లా కనిపిస్తున్నారు. లుంగీ కట్టుకుని భుజాన గోనె సంచీ, ఆధార్ కార్డ్‌తో విజయ్ నడిచి వస్తున్న పోస్టర్ ఆకట్టుకుంటోంది. ఫ్యామిలీ యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా రూపుదిద్దుకుంటున్న ఈ చిత్రం ప్రేక్షకులను అలరిస్తుందని దర్శకనిర్మాతలు చెప్పారు.

'చిత్రజ్యోతి'లో మరిన్ని ఆసక్తికర కథనాల కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి. లేదా ఈ కింది యూఆర్ఎల్ https://ejyothy.com/lb27nMSలో చదవండి.

యువతను మెప్పించే రేవ్ పార్టీ

క్రిష్ సిద్దిపల్లి

'నేను లేని నా ప్రేమకథ' చిత్రంతో హీరోగా వెండితెరకు పరిచయమయ్యారు క్రిష్ సిద్దిపల్లి. ఆయన కథానాయకుడిగా రూపొందిన 'రేవ్‌పార్టీ' చిత్రం విడుదలకు సిద్ధమైంది. ఈ సందర్భంగా క్రిష్ సినిమా విశేషాలను మీడియాతో పంచుకున్నారు.

- హీరో అవ్వాలనేది నా కోరిక. కెరీర్ ఆరంభంలో పలు తెలుగు చిత్రాలకు సహాయ దర్శకుడిగా, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్‌గా పనిచేశాను. ఆ తర్వాత నటుడిగా చిన్నపాత్రలు పోషించాను. ప్రస్తుతం హీరోగా మంచి అవకాశాలు వస్తున్నాయి. నేను హీరోగా నటించిన 'రేవ్‌పార్టీ' చిత్రం విడుదలకు సిద్ధమైంది. యువతను ఆకట్టుకునే వినూత్నమైన కథతో ఈ చిత్రం తెరకెక్కింది. రాజు బొనగాని దర్శకత్వంలో పాన్ ఇండియా స్థాయిలో ఈ చిత్రాన్ని తెరకెక్కించారు. రితిక చక్రవర్తి, ఐశ్వర్యగౌడ హీరోయిన్లు. సింగిల్ షెడ్యూల్‌లో చిత్రీకరణ పూర్తి చేశాం. ఉడుపి, గోవా, బెంగళూరు ప్రాంతాల్లో ఎక్కువగా రేవ్ పార్టీలు జరుగుతుంటాయి. అందుకే ఆ ప్రాంతంలోని ఒరిజినల్ లోకేషన్స్‌లో చిత్రీకరణ చేశాం. రేవ్‌పార్టీలు ఎలా జరుగుతాయి?, వాటి వెనుక ఎవరు ఉంటారు, యువతకు ఎలాంటి నష్టం జరుగుతుందనేది ఆసక్తికరంగా తెరకెక్కించాం. త్వరలోనే విడుదల తేదీ ప్రకటిస్తాం.





22న గోవాలో రకుల్ పెళ్లి



హీరోయిన్ రకుల్ ప్రీత్‌సింగ్ పెళ్లి ముహూర్తం ఖరారు అయింది. తన ప్రియుడు, నిర్మాత, నటుడు జాకీ భగ్నానితో ఆమె వివాహం ఈ నెల 22న గోవాలో జరుగనుంది మిడిల్ ఈస్ట్‌లో ధూమ్ ధామ్‌గా డెస్టినేషన్ వెడ్డింగ్ చేసుకోవాలని మొదట రకుల్, ఆమె బాయ్ ఫ్రెండ్ అనుకున్నారు. అయితే ప్రధాని నరేంద్ర మోదీ డెస్టినేషన్ వెడ్డింగ్స్ విదేశాల్లో కాకుండా మన దేశంలోనే నిర్వహించాలని ఇటీవల .విజ్ఞప్తి చేయడంతో రకుల్, జాకీ తమ ఆలోచన మార్చుకుని గోవాలో పెళ్లి చేసుకోవాలని నిర్ణయించుకున్నారు. పెళ్లి తర్వాత ముంబైలో రిసెప్షన్ గ్రాండ్‌గా ఏర్పాటు చేసి టాలీవుడ్, బాలీవుడ్‌లోని చిత్ర ప్రముఖులందరినీ ఆహ్వానించాలని కూడా వారు అనుకున్నారు. అయితే తాజాగా అందుతున్న సమాచారం ప్రకారం ముంబైలో కానీ మరెక్కడ కానీ వీళ్ల పెళ్లి రిసెప్షన్ జరగడం లేదు.

గ్రామీణ ప్రేమకథ



వినాయక్ దేశాయ్, అపర్ణా దేవి జంటగా నటించిన ప్రేమకథా చిత్రం 'రాధా మాధవం'. దాసరి ఇస్సాకు దర్శకత్వం వహించిన ఈ చిత్రాన్ని గోనాల్ వెంకటేశ్ నిర్మించారు. షూటింగ్ పూర్తి చేసుకున్న ఈ చిత్రం ట్రైలర్‌ను హీరో శ్రీకాంత్ విడుదల చేశారు. ట్రైలర్ బాగుందనీ, సినిమా విజయం సాధించాలనీ ఆయన కోరారు. నిర్మాత మాట్లాడుతూ 'గ్రామీణ నేపథ్యంలో రూపుదిద్దుకొన్న ప్రేమకథ ఇది. ఈ నెలలోనే చిత్రాన్ని విడుదల చేస్తాం' అని చెప్పారు. సెన్సార్ కార్యక్రమాలు జరుగుతున్నాయనీ, తను అనుకున్న విధంగా సినిమా తీయడానికి నిర్మాత ఎంతో సహకరించారనీ దర్శకుడు తెలిపారు. దీప్తి, మేకా రామకృష్ణ, జయప్రకాశ్, ప్రియ, నవీన్, రవి శివతేజ, సుమన్, రాచర్ల లాస్య తదితరులు నటించిన ఈ చిత్రానికి కథ, మాటలు, పాటలు: వసంత్ వెంకట్ బాలా, సంగీతం: చైతు కొల్లి, ఛాయాగ్రహణం: తాజ్ జీడీకే.


సమావేశంలో మాట్లాడుతున్న వడ్డెర కార్మిక నాయకులు

వడ్డెరలను బెదిరిస్తే సహించం

● దాచేపల్లి వడ్డెర కార్మిక నాయకులు

దాచేపల్లి, ఫిబ్రవరి2: బలహీనవర్గాలకు చెందినవారని వడ్డెర సామాజికవర్గానికి చెందినవారిని బెదిరించి భయపెట్టాలని చూస్తే సహించమని దాచేపల్లి మండల వడ్డెర సంఘ నాయకులు స్పష్టం చేశారు. శుక్రవారం నారాయణపురంలోని టీడీపీ కార్యాలయంలో దాచేపల్లి వడ్డెర నాయకులు సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి హాజరైన వడ్డెర నాయకులు మాట్లాడుతూ గురజాల పట్టణంలోని 12వ వార్డుకు చెందిన వైసీపీ కౌన్సిలర్ భర్త మహంకాళి నీలంరాజు వడ్డెర సామాజిక వర్గానికి చెందినవాడు కావడంతో ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి బెదిరింపులకు పాల్పడ్డాడని ఆగ్రహం వ్యక్తం చేశారు. నీలంరాజు శివమాల వేసుకొని ఉన్నా అతన్ని గురజాల నుంచి మాచవరం పోలీస్‌స్టేషన్‌కు తరలించి ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేస్తామని బెదిరించి దారుణంగా కొట్టడం జరిగిందని ఆవేదన వ్యక్తం చేశారు. కేవలం వడ్డెరలకు చెందిన నీలంరాజును మాత్రమే డబ్బులు కక్కిస్తామని బెదిరించడం సమంజసం కాదన్నారు. ఈ సమావేశంలో 6వ వార్డు కౌన్సిలర్ వేముల కృష్ణ, రాష్ట్ర బీసీసెల్ కార్యదర్శి బత్తుల రాంబాబు, మాజీ ఎంపీటీసీ గుంజా పూర్ణ, కుంచపు గంగరాజు, తమ్మిశెట్టి రామకృష్ణ, కొండేపూడి వంశీ, విశ్వబ్రాహ్మణ సంఘం అధ్యక్షులు నాగమల్లేశ్వరరావు, వేముల నరసింహారావు, ఇర్లా శ్రీను, ఏడుకొండలు, గోగుల శ్రీను, వెంకటరావు తదితరులున్నారు.

హద్దు మీరిన అధికారులపై ఈసీకి ఫిర్యాదు

● మాజీ మంత్రి ప్రత్తిపాటి పుల్లారావు


మాట్లాడుతున్న ప్రత్తిపాటి పుల్లారావు

చిలకలూరిపేట అర్బన్, ఫిబ్రవరి 2: రాష్ట్రంలో హద్దుమీరి ప్రవర్తిస్తున్న ప్రతి అధికారిపై ఈసీకి ఫిర్యాదు చేస్తామని మాజీ మంత్రి, రాష్ట్ర తెలుగుదేశం పార్టీ ఉపాధ్యక్షులు ప్రత్తిపాటి పుల్లారావు అన్నారు. చిలకలూరిపేట మండలం గోపాళంవారిపాలెం, మద్దిరాల, రాజాపేట, పోతవరం గ్రామాలకు చెందిన టీడీపీ, జనసేనకు చెందిన పార్టీ నాయకులు, కార్యకర్తలతో ప్రత్తిపాటి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవల జరిగిన బదిలీల్లో జగన్ వివాదాస్పద అధికారులను కావాల్సిన ప్రాంతాల్లోకి తెచ్చుకున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. డీఐజీ, ఎస్పీ స్థాయి అధికారుల నుంచి సీఐ, ఎస్‌ఐ వరకు వైసీపీ ప్రయోజనాలే లక్ష్యంగా ఈ బదిలీలు చేపట్టినట్టు తెలుస్తుందని ఆయన అన్నారు. ఎన్నికల సమయంలో వీళ్లల్లో ఏ ఒక్కరిని నమ్మే పరిస్థితి లేదని, సమస్యాత్మక ప్రాంతాల్లో వీరి పనితీరుపై తమకు తీవ్ర అభ్యంతరాలు ఉన్నాయన్నారు. ఎన్నికలు నిష్పక్షపాతంగా జరగాలంటే కోడ్ అమల్లోకి వచ్చిన అనంతరం జగన్ ప్రభుత్వం ఇటీవల చేపట్టిన ప్రతి బదిలీని పునఃసమీక్షించాలని, వివాదాస్పద అధికారులను పూర్తిగా పక్కన పెట్టాలని తమ డిమాండ్ అన్నారు. ఈ విషయం పై పార్టీ తరుపున ఈసీని కలవనున్నట్టు ఆయన వెల్లడించారు. ప్రతి కార్యకర్త రోజుకు ఒక గంట పార్టీకి పనిచేస్తే పార్టీ గెలుపు సులభం అవుతుందన్నారు. రాబోయే ఎన్నికలకు టీడీపీ, జనసేన శ్రేణులు సన్నద్ధంగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన నియోజక వర్గ కార్యకర్త తోట రాజా రమేష్, టీడీపీ నియోజకవర్గ సమన్వయకర్త నెల్లూరి సదాశివరావు, మండల పార్టీ అధ్యక్షులు జువ్వాజి మదన్ మోహన్ తదితరులు పాల్గొన్నారు.

ఐదుకోట్ల మంది ఆకాంక్ష అమరావతి

● 1508వ రోజుకు చేరుకున్న రైతుల ఆందోళనలు


తుళ్లూరు రైతు ధర్నా శిబిరంలో బిల్డ్ అమరావతి అంటూ నినాదాలు చేస్తున్న మహిళలు

తుళ్ళూరు, ఫిబ్రవరి 2: రాజధాని అమరావతిని నాశనం చేయాలనుకుంటే వైసీపీ ప్రభుత్వానికి తగిన శాస్తి జరుగుతుందని 33వేల ఎకరాల భూములిచ్చిన రైతులు పేర్కొన్నారు. బిల్డ్ అమరావతి, సేవ్ ఆంధ్రప్రదేశ్ అంటూ రైతులు చేపట్టిన ఆందోళనలు, నిరసనలు శుక్రవారం నాటికి 1508వ రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా రైతు ధర్నా శిబిరాల నుంచి వారు మాట్లాడుతూ, ఎన్నికల ముందు జగన్‌రెడ్డి అమరావతే రాష్ట్ర ఏకైక రాజధాని అని నమ్మబలికి, అధికారంలోకి వచ్చిన తరువాత మూడు రాజధానులని నట్టేట ముంచే ప్రయత్నం చేస్తున్నాడన్నారు. విశాఖ, కర్నూలు రాజధానులు పెడతానంటూ అభివృద్ధి లేకుండా చేశాడన్నారు. మాట తప్పను మడమ తిప్పను అన్న ఆయన అమరావతిని నిర్వీర్యం చేసి వెనకడుగు వేస్తున్నాడన్నాడని ఆగ్రహం వ్యక్తం చేశారు. అమరావతి అభివృద్ధిని కొనసాగించమని రాష్ట్ర ఉన్నత న్యాయస్థానం ఆదేశాలను ఇచ్చినా అమలు చేయాలన్నారు. బిల్డ్ అమరావతి, జై ఆంధ్రప్రదేశ్ అంటూ దీపాలు వెలిగించి నినాదాలు చేశారు. రాజధాని 29 గ్రామాల్లో ఆందోళనలు కొనసాగాయి.

నేడు వడ్లపూడి బాబా మందిర వార్షికోత్సవం

● ఏర్పాట్లను పర్యవేక్షించిన పాతూరి నాగభూషణం


అన్న సంతర్పణ ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్న పాతూరి నాగభూషణం

మంగళగిరి, ఫిబ్రవరి 2: మంగళగిరి మండలం పెదవడ్లపూడి గ్రామంలోని భగవాన్ శ్రీసత్య షిరిడీ సాయిబాబా మందిర వార్షికోత్సవం శనివారం జరుగనుంది. ఏటా ఫిబ్రవరి మూడవ తేదీన మందిర వార్షికోత్సవాన్ని ఓ భారీ తిరునాళ్ల మాదిరి నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. 2006లో అప్పటి జిల్లా పరిషత్ ఛైర్మన్‌గా ఉన్న పాతూరి నాగభూషణం తన స్వగ్రామమైన పెదవడ్లపూడిలో ఈ మందిరాన్ని నిర్మించారు. పక్కనే శ్రీ విఘ్నేశ్వరస్వామివారి ఉపాలయాన్ని కూడా నిర్మించారు. అప్పటినుంచి ఏటా అటు ఆధ్యాత్మికతను, ఇటు సాంస్కృతిక వైభవాన్ని మేళవించి భారీ తిరునాళ్ల మాదిరి జరిపిస్తున్నారు. మందిరానికి ఎదురుగా ఓ ప్రత్యేక గోశాలను కూడ ఏర్పాటు చేయించారు. ఆంధ్ర షిరిడీగా దీనిని అభివృద్ధి చేస్తున్నారు. 18వ వార్షికోత్సవానికి అన్నీ ఏర్పాట్లను శుక్రవారం సాయంత్రానికే పూర్తి చేశారు. ఈ ఏర్పాట్లను ఆలయ కమిటీ ఛైర్మన్, జడ్పీ మాజీ ఛైర్మన్ పాతూరి నాగభూషణం రెండు రోజులుగా దగ్గరుండి పర్యవేక్షిస్తున్నారు. మందిరానికి ఎదురుగా వున్న ఖాళీస్థలంలో సాంస్కృతిక కళావేదిక ప్రాంగణం, దాని పక్కనే అన్న ప్రసాదశాలను ఏర్పాటుచేయించారు. ఖాళీస్థలంలో పిల్లలకోసం జయింట్‌వీల్ వంటి రంగులరాట్నాలతో కూడిన క్రీడా ప్రాంగణాన్ని అన్ని హంగులతో ప్రత్యేకంగా ఏర్పాటు చేయిస్తున్నారు. మందిరంలో శనివారం తెల్లవారుజాము ఐదు గంటల నుంచే బాబావారి విగ్రహానికి వివిధ అభిషేకాలతో ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహిస్తారు. భక్తులకు పెద్దఎత్తున అన్నవితరణ గావించేందుకు భారీఏర్పాట్లు చేశారు. సినీ, టీవి కళాకారులతో ప్రత్యేక కార్యక్రమాలను నిర్వహించేందుకు ఏర్పాట్లను పూర్తి చేశారు.

రెండో రోజు.. అదే ఉత్సాహం

● కొనసాగిన విజ్ఞాన్ మహోత్సవ్ ● నేటితో ముగియనున్న ఉత్సవాలు


కబడ్డీలో నువ్వా... నేనా అంటూ..


బాస్కెట్‌బాల్ పోటీలో...

గుంటూరు(విద్య), ఫిబ్రవరి 2: చేబ్రోలు మండలం వడ్లమూడి విజ్ఞాన్స్ యూనివర్సిటీలో జరుగుతున్న జాతీయస్థాయి విజ్ఞాన్ మహోత్సవ్ నేటితో ముగియనున్నాయి. శుక్రవారం జరిగిన కార్యక్రమానికి హాజరైన వర్సిటీ వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ పి.నాగభూషణ్ మాట్లాడుతూ యువత తమ కలల్ని సాకారానికి అంకితభావంతో కృషి చేయాలని పిలుపునిచ్చారు. వేడుకల్లో భాగంగా విద్యార్థులు క్రీడా సంబరాల్లో మునిగిపోయారు. బాస్కెట్‌బాల్, ఖోఖో, ఫుట్‌బాల్, టేబుల్ టెన్నిస్, చెస్, టెన్నికాయిట్, అథ్లెటిక్స్ ఇలా అనేక విభాగాల్లో విద్యార్థులు అద్భుత ప్రతిభ చూపారు. అంతర్లీనంగా దాగిన కళలు, సృజనాత్మక నైపుణ్యాలకు పదును పెట్టారు. వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన విద్యార్థులు సోలో సాంగ్స్, లఘు నాటికలు, రెట్రో డాన్స్ ప్రదర్శనలతో ఆకట్టుకున్నారు. విజ్ఞాన్ మహోత్సవ్ నేటితో ముగియనుంది. ముగింపు కార్యక్రమానికి గౌరవ అతిథులుగా ఇండియన్ నేషనల్ క్రికెట్ టీమ్ మాజీ సెలక్టర్, క్రికెటర్ ఎమ్మెస్కే ప్రసాద్, నటుడు కిరణ్ అబ్బవరం, రచయిత బుర్రా సాయి మాధవ్‌లు రానున్నారని వీసీ వెల్లడించారు. కార్యక్రమంలో విజ్ఞాన్స్ విద్యా సంస్థల ఛైర్మన్ డాక్టర్ లావు రత్తయ్య, రిజిస్ట్రార్ డాక్టర్ ఎంఎస్ రఘునాథన్, ఆయా విభాగాల డీన్లు, అధిపతులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సుందరం మాస్టర్ యూనిట్ సందడి




యువత ఫ్యాన్‌షో.. నృత్యాలు, ఇన్‌సెట్లో మాట్లాడుతున్న వైవా హర్ష

గుంటూరు(విద్య), ఫిబ్రవరి 2: విజ్ఞాన్స్ విద్యాసంస్థలో ఇంజినీరింగ్ పూర్తి చేసిన తాను... సినీ హీరోగా మీ ముందుకు మీలో ఒకడిగా వస్తున్నాని వర్ధమాన సినీ నటుడు హర్ష చెముడు (వైవా హర్ష) అన్నారు.విజ్ఞాన్స్ యూనివర్సిటీలో విజ్ఞాన్స్ మహోత్సవ్‌లో రెండో రోజు సుందరం మాస్టర్ సినిమా యూనిట్ సందడి చేసింది. హీరో హర్ష మాట్లాడుతూ మీ మీద మీకు నమ్మకం ఉండాలని, మీకు ఏది అనిపిస్తే అదే చేయాలన్నారు. తన సినీ జీవితంలో ఇంకా సాధించాల్సింది చాలా ఉందని విద్యార్థులకు తెలిపారు. డైరెక్టర్ కల్యాణ్ సంతోష్ మాట్లాడుతూ బ్యాక్ బెంచ్ విద్యార్థులకు, తోటి స్నేహితులకు సపోర్ట్‌గా నిలిస్తే... వారు ఏదో ఒకరోజు అద్భుతాలు సృష్టిస్తారని పేర్కొన్నారు.

80 కిలోల గంజాయి స్వాధీనం

● కాజ టోల్‌ప్లాజా వద్ద గంజాయి పట్టివేత ● గంజాయి రూ.20 లక్షల విలువ ● పోలీసుల అదుపులో నలుగురు నిందితులు


నిందితుల వివరాలను వెల్లడిస్తున్న డీఎస్ఈవో వెంకటేశ్వరరావు

మంగళగిరి సిటీ, ఫిబ్రవరి 2: మంగళగిరి మండలం కాజ టోల్‌ప్లాజా వద్ద మంగళగిరి ఎస్ఈబీ అధికారులు వాహనాలు తనిఖీ చేస్తుండగా గంజాయి పట్టుబడింది. మంగళగిరి ఎస్ఈబీ కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఎస్ఈబీ డీఎస్ఈవో ఎం.వెంకటేశ్వరరావు వివరాలను వెల్లడించారు. ఎస్ఈబీ అధికారులు టోల్‌ప్లాజా వద్ద గురువారం మధ్యాహ్నం వాహనాలను తనిఖీ చేస్తుండగా ఓ కారులో 76 కిలోల గంజాయిని గుర్తించినట్టు చెప్పారు. వెనుకగా వస్తున్న మరో కారులో 4 కిలోల గంజాయిని గుర్తించడం జరిగిందన్నారు. మొత్తం రూ.20 లక్షల 38 వేల విలువ చేసే 80 కిలోల గంజాయితోపాటు రెండు కార్లు, రూ.13,590 నగదును స్వాధీనం చేసుకున్నట్టు తెలిపారు. తిరుపతి జిల్లా శట్టిపల్లె గ్రామానికి చెందిన మన్నెం బత్తయ్య, పొత్తూరు గ్రామానికి చెందిన పసుపులేటి గిరిబాబు, చంద్రగిరి మండలం వేదాంతపురం గ్రామానికి చెందిన ఎట్టికుప్పం మునిబాలిరెడ్డి, బుచ్చినాయుడుపల్లి గ్రామానికి చెందిన పాకాల రాజశేఖర్ అనే నలుగురు నిందితులను అదుపులోకి తీసుకున్నట్టు వెల్లడించారు. మరో ఇరువురు నిందితులు విశాఖపట్నం పాకాలపాడు పుత్తాడి గ్రామానికి చెందిన చిన్నా అలియాస్ మంగళపల్లి ప్రతాప్, తిరుపతి జిల్లా చేకూరుపల్లి గ్రామానికి చెందిన కోడిపుంజుల వాసులు పరారీలో వున్నట్టు తెలిపారు. నిందితులు కారు కిరాయిలకు తిప్పుతూ చెడు వ్యసనాలకు బానిసలై ఈజీ మనీకి అలవాటు పడి వక్రమార్గంలో ఎక్కువ డబ్బు సంపాదించాలనే దుర్బుద్ధితో గంజాయి అక్రమ రవాణాకు పాల్పడుతున్నట్టు చెప్పారు. అనకాపల్లి జిల్లా పరిసర ప్రాంతాల్లో గంజాయి కొనుగోలు చేసి తిరుపతి జిల్లాలో అధిక ధరలకు అమ్ముకుంటూ సొమ్ము చేసుకుంటున్నారని తెలిపారు. ఈ సమావేశంలో ఎన్‌ఫోర్స్‌మెంట్ సూపరింటెండెంట్ ఎల్.రంగారెడ్డి, అసిస్టెంట్ సూపరింటెండెంట్ ఎస్.కృష్ణకిషోర్‌రెడ్డి, మంగళగిరి ఎస్ఈబీ సీఐ ప్రసన్నలక్ష్మి, సిబ్బంది పాల్గొన్నారు.

భార్యను కడతేర్చిన భర్త

వినుకొండటౌన్, ఫిబ్రవరి 2: కుటుంబ కలహాల నేపథ్యంలో భార్యను భర్త చంపిన ఘటన పట్టణంలోని మసీదుమాన్యంలో గురువారం రాత్రి చోటు చేసుకుంది. పట్టణ సీఐ సాంబశివరావు తెలిపిన వివరాల ప్రకారం.. బొల్లాపల్లి మండలం పలుకూరు గ్రామానికి చెందిన అంగలకుదురు పోతులూరయ్యచారి, నూజెండ్ల మండలం ఐనవోలు గ్రామానికి చెందిన నాగేశ్వరి(30)లకు పదేళ్ల క్రితం వివాహమైంది. కొంతకాలంగా వారిద్దరి మధ్య కలతలు ఏర్పడ్డాయి. ఈ క్రమంలో నాగేశ్వరిపై గురువారం భర్త గడ్డపారతో దాడి చేసి గాయపరిచాడు. దీంతో ఆమె అక్కడికక్కడే మృతిచెందింది. పోలీసులు సంఘటనా ప్రాంతానికి చేరుకొని మృతదేహాన్ని వినుకొండ ప్రభుత్వ వైద్యశాలకు తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు. భర్త పోతులూరయ్యచారి పరారీలో ఉన్నట్లు ఆయన తెలిపారు. మృతురాలికి కుమార్తె కలదు.

ద్విచక్ర వాహనం పైనుంచి పడి మహిళ మృతి

మాచర్ల, ఫిబ్రవరి 2: ద్విచక్ర వాహనంపై నుంచి పడి మహిళ మృతిచెందిన ఘటన మండలంలోని పశువేముల సమీపంలో గురువారం రాత్రి జరిగింది. మండలంలోని చింతలతండాకు చెందిన రమావత్ బుజ్జిబాయి(42) తన కుమారుడు బైకుపై మాచర్ల నుంచి స్వగ్రామానికి వస్తుండగా పశువేముల సమీపంలోకి రాగానే ఎదురుగా ఆటో రావడంతో బైకు అదుపుతప్పి కిందపడిపోయింది. ఈ ఘటనలో బుజ్జిబాయి తలకు తీవ్ర గాయాలు కావడంతో పట్టణంలోని ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. చికిత్స పొందుతూ బుజ్జిబాయి మృతిచెందింది. మృతురాలికి ఇరువురు కుమారులు ఉన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు విజయపురి సౌత్ ఎస్ఐ వెంకట కొండారెడ్డి తెలిపారు.

భారీగా గోవా మద్యం స్వాధీనం


శ్రీనివాసరావును అరెస్ట్ చూపుతున్న జిల్లా సూపరింటెండెంట్ ఖాజా మొహిద్దీన్

వినుకొండటౌన్, ఫిబ్రవరి 2: అక్రమంగా గోవా మద్యాన్ని విక్రయిస్తున్న వ్యక్తిని అదుపులోకి తీసుకొని రూ.10లక్షల విలువ చేసే మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు పల్నాడు జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్ ఖాజా మొహిద్దీన్ తెలిపారు. స్థానిక ఎక్సైజ్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మండలంలోని చీకటీగలపాలెం అడ్డరోడ్డులోని ప్రియాంక డాబా హోటల్ యజమాని వల్లెం శ్రీనివాసరావు గోవా నుంచి తెచ్చిన మద్యాన్ని నిల్వ ఉంచి విక్రయిస్తున్నట్లు తెలిపారు. అతనిని అరెస్టు చేసి మద్యం సీసాలు, ద్విచక్ర వాహనాన్ని స్వాధీనం చేసుకున్నట్లు ఆయన తెలిపారు. సమావేశంలో ఎస్ఐ నగేష్, సిబ్బంది సురేష్ తదితరులు ఉన్నారు.

త్వరలో మల్లాది టీడీపీలో చేరిక


మల్లాది శ్రీమన్నారాయణ

చిలకలూరిపేట, ఫిబ్రవరి 2: పట్టణానికి చెందిన సీనియర్ రాజకీయ నాయకుడు, నటుడు మల్లాది శ్రీమన్నారాయణ త్వరలో తెలుగుదేశం పార్టీలో చేరబోతున్నారు. ఇప్పటికే ఆయన ఎంపీ శ్రీకృష్ణదేవరాయలు, మాజీ మంత్రి ప్రత్తిపాటి పుల్లారావుతో టచ్‌లో ఉన్నారు. 2019 ఎన్నికల్లో మల్లాది వైసీపీ అభ్యర్థిగా పోటీచేసిన విడదల రజినీకి చీఫ్ ఎలక్షన్ ఏజెంట్‌గా వ్యవహరించారు. అనంతరం హైదరాబాద్ వెళ్ళి పలు టీవీ సీరియళ్లలో నటిస్తూ వచ్చారు. ఆయన 1985-88 మధ్య గుంటూరు జిల్లా టీడీపీ అధ్యక్షుడిగా వ్యవహరించారు. 1985-86లో ఏపీ ఐఐసీ డైరెక్టర్‌గా ఉన్నారు. 1987లో జిల్లా పరిషత్ అధ్యక్ష ఎన్నికల్లో అధ్యక్షుడిగా పోటీ చేసి దొడ్డపనేని ఇందిరపై ఓడిపోయారు. 1995 - 99లో టీడీపీ రాష్ట్ర సాంస్కృతిక విభాగం అధ్యక్షులుగా వ్యవహరించారు. 1997, 2002లో ఆర్టీసీ జోనల్ ఛైర్మన్‌గా, స్టేట్ బోర్డు డైరెక్టర్‌గా వ్యవహరించారు. 2004లో రాయపాటి సాంబశివరావు ప్రోద్బలంతో చిలకలూరిపేట అసెంబ్లీ స్థానం నుంచి కాంగ్రెస్ టిక్కెట్‌పై పోటీ చేసి ఓటమి పాలయ్యారు. తిరిగి 2014లో మల్లాది టీడీపీ విజయానికై ఇక్కడ కృషి చేశారు. గత నాలుగున్నరేళ్ళుగా రాజకీయాలకు దూరంగా ఉన్న మల్లాది ఇప్పుడు టీడీపీ వైపు దృష్టి సారించారు.

రైతుల ప్రత్యామ్నాయ ప్లాట్లపై అపోహలు వద్దు


● ఏపీ సీఆర్‌డీఏ స్పెషల్ ల్యాండ్స్ కలెక్టర్

విజయవాడ, ఫిబ్రవరి 2: ఆంధ్రప్రదేశ్ రాజధాని ప్రాంత అభివృద్ధి ప్రాధికార సంస్థ (ఏపీ సీఆర్‌డీఏ) పరిధిలో భూసమీకరణ పథకంలో భూములను ఏపీ సీఆర్‌డీఏకి అప్పగించిన రైతులకు కేటాయించిన నివేశన, వాణిజ్యస్థలాలు భూసేకరణలో ఉన్నందున రైతులకు ప్రత్యామ్నాయ ప్లాట్లు కేటాయించాలని రాష్ట్రప్రభుత్వం నిర్ణయించినట్లు ఏపీ సీఆర్‌డీఏ ల్యాండ్స్ స్పెషల్ కలెక్టర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. కొన్ని ప్లాట్లు భూసేకరణ పూర్తికాని భూమిలో ఉన్నట్లుగా గుర్తించి రైతులకు ప్రత్యామ్నాయ ప్లాట్లు పొందాలని నోటీసులు జారీచేసినట్లు పేర్కొన్నారు. ఈ లాటరీ ప్లాట్ల కేటాయింపు అంశంలో మాస్టర్ ప్లాన్‌లో లాంటి మార్పులు జరగలేదన్నారు. రైతులకు ప్రత్యామ్నాయ ప్లాట్ల కేటాయింపులో వారి గ్రామాల్లోనే ప్లాట్లు కేటాయించేందుకు చర్యలు తీసుకున్నామన్నారు. గతంలో పొరపాట్లను సరిదిద్దేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. ప్రభుత్వ ఆదేశాలతో ప్రత్యామ్నాయ ప్లాట్లు కేటాయించేందుకు ఆన్‌లైన్ ర్యాండమ్ సిస్టం ద్వారా ఈ-లాటరీ జరుగుందన్నారు. ఈ-లాటరీకి హాజరయ్యే రైతులకు ఆయా గ్రామాలకు లేఅవుట్ ప్లాన్లు విజయవాడలోని ఏపీ సీఆర్‌డీఏ కార్యాలయంలో అందుబాటులో ఉంచామన్నారు. రైతులకు సందేహాలుంటే నివృత్తి చేస్తామన్నారు. అయినా ప్రత్యేకంగా రైతుల సౌకర్యార్థం, వారి సందేహాలను నివృత్తి చేసేందుకు ఐనవోలు, నేలపాడు, శాఖమూరు, తుళ్లూరు-1,2, అనంతవరం, కురగల్లు-1,2, నెక్కల్లు, నిడమర్రు 1,2, వెలగపూడి, ఉద్దండరాయునిపాలెం, మందడం -1,2, కొండమరాజుపాలెం, నవులూరు-1,2, లింగాయపాలెం, వెంకటపాలెం, రాయపూడి-1,2 గ్రామాల రైతులకు ఫిబ్రవరి 3, 4న సిబ్బంది కార్యాలయంలో అందుబాటులో ఉంటారన్నారు. ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఈ-లాటరీలో పాల్గొనే రైతులు విజయవాడలోని ఏపీ సీఆర్‌డీఏ ప్రధాన కార్యాలయానికి వచ్చి సందేహాలను నివృత్తి చేసుకోవచ్చన్నారు.

నవులూరు, లింగాయపాలెం ఈ-లాటరీ 8కి వాయిదా

ఏపీ సీఆర్‌డీఏ పరిధిలో భూసమీకరణ పథకంలో భూములను సీఆర్‌డీఏకు అప్పగించిన రైతులకు కేటాయించబడిన నివేశన, వాణిజ్య స్థలాలు భూసేకరణలో ఉన్నందున, అదింకా పూర్తికానందున రైతులకు కేటాయించేందుకు ఫిబ్రవరి 2న జరగాల్సిన నవులూరు, లింగాయపాలెం గ్రామాల మూడో విడత ఈ-లాటరీ ఫిబ్రవరి 8కి వాయిదా వేసినట్టు అధికారులు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. రెండుసార్లు నోటీసులిచ్చినా రైతులు హాజరుకాకపోవడంతో వారికి మరో అవకాశం ఇచ్చి ఫిబ్రవరి 8న బుధవారం ఉదయం 11 గంటలకు నవులూరు 1,2, మధ్యాహ్నం 12గంటలకు లింగాయపాలెం గ్రామాలకు లాటరీ నిర్వహిస్తామని అధికారులు తెలిపారు.

రియల్‌ఎస్టేట్ వ్యాపారి ఆత్మహత్య


ఏడుకొండలు మృతదేహం

నరసరావుపేట రూరల్, ఫిబ్రవరి 2: పట్టణ శివారు కాలనీ కామిరెడ్డి రోశిరెడ్డి నగర్ వద్ద నరసరావుపేట పట్టణానికి చెందిన రియల్ ఎస్టేట్ వ్యాపారి కుంచెపు ఏడుకొండలు(55) శుక్రవారం తెల్లవారుజామున పురుగుల మందుతాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. నరసరావుపేట రూరల్ ఎస్‌ఐ రోశయ్య తెలిపిన వివరాల ప్రకారం.. బాపట్ల జిల్లా సంతమాగులూరు మండలం చవిటిపాలెం గ్రామానికి చెందిన ఏడుకొండలు గత 20 ఏళ్ళుగా నరసరావుపేట పట్టణంలోని బరంపేట శిశుమందిర్ స్కూలు వద్ద నివాసముంటున్నాడు. గురువారం రాత్రి ఇంటికి రాకపోవడంతో కుటుంబసభ్యులు పట్టణంలో వెతికారు. శుక్రవారం ఉదయం వినుకొండ రోడ్డులోగల కామిరెడ్డి రోశిరెడ్డి నగర్ వద్ద పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకుని ఉన్నారు. భార్య పద్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు రూరల్ ఎస్‌ఐ రోశయ్య తెలిపారు. ఏడుకొండలు ఆత్మహత్యకు ఆర్థిక సమస్యలా మరేమైనా ఇతర కారణాలు ఉన్నాయా అని పోలీసుల విచారణలో తెలియాల్సి ఉంది.

రియల్ ఎస్టేట్ మధ్యవర్తి దారుణ హత్య


హత్యకు గురైన రామకృష్ణ

సత్తెనపల్లి, ఫిబ్రవరి 2: రియల్ ఎస్టేట్ వ్యాపారంలో మధ్యవర్తిగా పనిచేసే వ్యక్తి దారుణ హత్యకు గురైన ఘటన పట్టణంలోని ఆర్‌అండ్‌బీ బంగ్లా ఆవరణలో గురువారం అర్ధరాత్రి తరువాత జరిగింది. పట్టణంలోని రంగాకాలనీకి చెందిన చెన్నంశెట్టి రామకృష్ణ (45) రియల్ ఎస్టేట్ బ్రోకర్‌గా పనిచేస్తున్నాడు. అతను తన ఇంటిని అమ్ముకొని పట్టణంలోని 14వ వార్డులో ఓ మహిళతో వివాహేతర సంబంధం కొనసాగిస్తున్నాడని పోలీసులు తెలిపారు. రామకృష్ణ ఆర్‌అండ్‌బీ బంగ్లా ఆవరణలో మృతి చెంది ఉండటాన్ని ఆ ప్రాంత ప్రజలు గుర్తించి పోలీసులకు సమాచారాన్ని అందించారు. వెంటనే పోలీసులు ఘటనా స్థలానికి వెళ్ళి వివరాలు సేకరించారు. రామకృష్ణ గొంతు కోసి చంపి ఉండటాన్ని గుర్తించారు. మద్యం సేవించేందుకు రామకృష్ణను తీసుకు వచ్చి నమ్మకంగా చంపారని పోలీసులు భావిస్తున్నారు. క్లూస్ టీమ్‌ను, డాగ్ స్క్వాడ్‌ను కూడా రప్పించి విచారణ చేపట్టారు. రామకృష్ణతో వివాహేతర సంబంధం కొనసాగిస్తున్న మహిళను పోలీసులు అదుపులోకి తీసుకొని విచారిస్తున్నారు. బంధువుల ఫిర్యాదు మేరక కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గుంటూరు మిర్చియార్డులో ధరలు ఇలా...

గుంటూరు, ఫిబ్రవరి 2(ఆంధ్రజ్యోతి): మిర్చియార్డుకు శుక్రవారం 1,21,141 టిక్కీల మిర్చి విక్రయానికి రాగా అందులో 1,21,190 అమ్మకం జరిగినట్లు గుంటూరు వ్యవసాయ మార్కెట్‌కమిటీ జాయింట్ డైరెక్టర్ కె.శ్రీనివాసరావు తెలిపారు. ఇంకా యార్డులో 70,863 మిర్చి టిక్కీలు నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు. వివిధ రకాల మిరపకాయలకు ధరలు ఈ కింది విధంగా నమోదయ్యాయి.

వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర	వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర
నాన్ ఏసీ కామన్ వెరైటీ			సూపర్ 10	14500	17000
334	9000	20500	నాన్ ఏసీ స్పెషల్ వెరైటీ		
నెంబరు.5	9500	18000	తేజ	8000	21500
273	12500	20100	బ్యాడిగి	10000	19000
341	8500	20000	దేవనూరుడీలక్స్	11000	18000
4884	10000	19500	తెల్లకాయలు	5000	12000

పదో తరగతి విద్యార్థిని ఆత్మహత్య

● డ్రైవర్ వేధింపులే కారణం?

పిడుగురాళ్ల, ఫిబ్రవరి 2: స్థానిక జడ్పీ హైస్కూల్‌లో 10వ తరగతి చదువుతున్న విద్యార్థిని గురువారం ఉరివేసుకుంది. ఇది గమనించిన కుటుంబసభ్యులు గుంటూరు జనరల్ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ గురువారం రాత్రి మృతిచెందింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. స్థానిక ప్రజాశక్తినగర్‌లో నివాసముంటున్న చెరుకూరి క్రిస్టినా(15) 10వ తరగతి చదువుతోంది. తండ్రి సామ్యేలు హైదరాబాద్‌లో చర్చి పాస్టర్‌గా పనిచేస్తూ తాతయ్య, అమ్మమ్మల వద్ద వుంచి చదివిస్తున్నాడు. మాదినపాడు గ్రామానికి చెందిన కొత్తపల్లి సాగర్ వాహనాలకు డ్రైవర్‌గా పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఈ క్రమంలో క్రిస్టినాను ప్రేమిస్తున్నానంటూ కొంతకాలంగా సాగర్ వేధింపులకు గురిచేస్తున్నాడు. వేధింపులను తట్టుకోలేక క్రిస్టినా ఉరివేసుకొని మృతిచెందింది. బంధువుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

రైలు ఢీకొని మహిళ మృతి

తెనాలి క్రైం, ఫిబ్రవరి 2: రైలు ఢీకొని మహిళ మృతి చెందిన ఘటన కొలనుకొండ రైల్వే స్టేషన్ వద్ద శుక్రవారం జరిగింది. తెనాలి రైల్వే పోలీసులు తెలిపిన సమాచారం మేరకు తెనాలి-విజయవాడ ప్రధాన రైలు మార్గంలో కొలనుకొండ రైల్వే స్టేషన్ సమీపంలో శుక్రవారం మధ్యాహ్నం 55-60సంవత్సరాల గుర్తు తెలియని మహిళ ఎదురుగా వస్తున్న రైలును గమనించకుండా పట్టాలు దాటుతుండగా రైలు ఢీ కొని మృతి చెందింది. మృతురాలికి సంబంధించిన సమాచారం లభించకపోవడంతో మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తెనాలి ప్రభుత్వ వైద్యశాలకు తరలించినట్లు రైల్వే పోలీసులు తెలిపారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.28 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్	114, 122,133
చికెన్ విత్ స్కిన్	214.00
చికెన్ స్కిన్ లెస్	224.00



భవిష్యత్‌కు గ్యారెంటీలో కరపత్రాలు పంపిణీ చేస్తున్న కన్నా లక్ష్మీనారాయణ, టీడీపీ నేతలు

సైకో పాలనకు చరమగీతం పాడాలి

● టీడీపీ అభ్యర్థి కన్నా లక్ష్మీనారాయణ

సత్తెనపల్లి, ఫిబ్రవరి 2 : సైకో పాలనకు ప్రజలంతా చరమ గీతం పాడాలని టీడీపీ అభ్యర్థి కన్నా లక్ష్మీనారాయణ అన్నారు. పట్టణంలోని 11వ వార్డులో శుక్రవారం సాయంత్రం బాబు ష్యూరిటీ భవిష్యత్‌కు గ్యారెంటీ ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను వివరించారు. టీడీపీ, జనసేన ప్రభుత్వం అధికారంలోకి వస్తే చేపట్టనున్న సంక్షేమ పథకాల గురించి ప్రజలకు తెలియజేస్తూ కరపత్రాలను పంపిణీ చేశారు. తెలుగుదేశం, జనసేన కూటమిని బలపరచాలన్నారు. ముందుగా విఘ్నేశ్వర స్వామి దేవాలయంలో పూజలు చేశారు తెలుగుదేశం అధికారంలోకి వస్తే చేపట్టనున్న ప్రభుత్వ పథకాల గురించి ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర నాయకులు ఎలినేడి రామస్వామి, చౌట శ్రీనివాసరావు, నాయకులు కటకం రామకృష్ణ, ఆతుకూరి నాగేశ్వరరావు, వార్డు టీడీపీ నేతలు చుక్కపల్లి కొండలు, కౌన్సిలర్ గుజ్జర్లపూడి సతీష్, పోట్ల ఆంజనేయులు, చిలకా జిప్సన్, మార్కెట్ రాజు, సయ్యద్ మాబు, తోట అంబిక, కొఠారు సంధ్య, మన్నవ శారదాదేవి, పృధ్వి నాగేశ్వరరావు, నోముల ప్రకాష్, బలిజేపల్లి సురేష్‌కుమార్, మారెళ్ళ మల్లేశ్వరరావు, ఆళ్ళ అమరేశ్వరరావు, కొనికినేని సత్యనారాయణ, కట్టా రమేష్, టీడీపీ నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పలువురిని పరామర్శించిన కన్నా

ముప్పాళ్ళ ఫిబ్రవరి 2 : మండలంలోని చాగంటివారిపాలెంలో ఇటీవల మృతి చెందిన టీడీపీ కార్యకర్త పమిడిపల్లి యలమందయ్య కుటుంబసభ్యులను శుక్రవారం సత్తెనపల్లి టీడీపీ అభ్యర్థి కన్నా లక్ష్మీనారాయణ పరామర్శించారు. యలమందయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. పార్టీ పరంగా అండగా ఉంటామని కుటుంబసభ్యులకు కన్నా భరోసానిచారు. గ్రామంలోని విశ్రాంత ఉపాధ్యాయుడు యర్రబాటి పిచ్చయ్య మాస్టారుని పరామర్శించి యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం కుందురువారిపాలెంలో అనారోగ్యంతో బాధపడుతున్న టీడీపీ నాయకుడు బొక్కిసం మల్లికార్జునరావు తల్లి నారాయణమ్మని కన్నా పరామర్శించారు. ఆయన వెంట టీడీపీ మండల అధ్యక్షుడు బత్తుల నాగేశ్వరరావు, శ్రీనివాసరెడ్డి, మదిర రామకృష్ణారెడ్డి, తిరుపతి అశోక్, రుద్రబాటి రామకృష్ణ, కడియం శ్రీనివాసరావు, నీలం రామలింగయ్య, కోటేశ్వరరావు, ఈశ్వరరెడ్డి, బండ్లమూడి శ్రీనివాసరావు, వెంకటేశ్వరరెడ్డి, చక్రపాణిరెడ్డి నాయకులు తదితరులున్నారు.

బీసీల జోలికొస్తే ఊరుకోము

● నీలం రాజుపై బెదిరింపులను ఖండించిన పలు సంఘాలు



సమావేశంలో మాట్లాడుతున్న టీడీపీ వడ్డెర, బీసీ సంఘ నేతలు

పిడుగురాళ్ల, ఫిబ్రవరి 2 : ప్రజాస్వామ్యంలో ఎవరికిష్టమైన పార్టీలో వారు కొనసాగే హక్కు ఉంటుందని, సీటు కేటాయించినంత మాత్రాన అదే పార్టీలో ఉండాల్సిన అవసరం ఉండబోదని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి తురకా వీరస్వామి, జిల్లా వడ్డెర సాధికార సమితి కన్వీనర్ వేముల ఆంజనేయులు తెలిపారు. పిడుగురాళ్ల టీడీపీ కార్యాలయంలో శుక్రవారం వారు విలేకర్లతో మాట్లాడుతూ గురజాలలోని 12వ వార్డు కౌన్సిలర్ మహంకాళి అనిత భర్త నీలంరాజును ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి అధికార గర్వంతో బెదిరించడం ఏమిటన్నారు. శివ దీక్షలో ఉన్నాడని కూడా చూడకుండా పోలీసులతో అక్రమం గా నిర్బంధింపజేసి కొట్టడాన్ని ప్రతి బీసీ సంఘాల నేతలు మర్చిపోరన్నారు. ఈ కార్యక్రమంలో దూదేకుల ఖాశింసైదా, కుంచపు గంగరాజు, యరగాని వెంకట్, జమ్మిశెట్టి రామకృష్ణ, కొండెపూడి వంశీ, సుతారు మల్లేశ్వరరావు, తురకా పిచ్చా రావు, కుంచపు శ్రీనివాసరావు, యడవల్లి శ్రీను, ఉసిరికాయల అంకారావు, తాళ్ల వాసు, బిజిలి వెంకటరావు, రజక సంఘ నాయకులు వెంకటరావు, తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా బీసీ సంక్షేమ సంఘం కార్యాలయంలో నీలంరాజుపై బెదిరింపులకు పాల్పడటాన్ని ఖండించారు. బీసీ సంఘం ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో బీసీలపై మహేష్‌రెడ్డికి చిత్తశుద్ధి వుంటే నీలంరాజుతో అలా ప్రవర్తించకూడదన్నారు. ఈ సమావేశంలో గురజాల నియోజకవర్గ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షులు కొక్కెర కొండలు, యడవల్లి కొండలు, దూదేకుల ఖాశింసైదా, సలీం, కాకర్ల గిరి, అనంతుల శ్రీను, శేషగిరి, నడికోట సత్యనారాయణ, కర్పూరపు కోటేశ్వరరావు, దూదేకుల బాషా, మస్తాన్, రామారావు తదితరులు పాల్గొన్నారు.

నేడు జయహో బీసీ కార్యక్రమం

పిడుగురాళ్ల, ఫిబ్రవరి 2 : గురజాల మాజీ ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు ఆధ్వర్యంలో శనివారం ఉదయం 10 గంటలకు దాచేపల్లిలో జయహో బీసీ కార్యక్రమం జరుగుతుందని టీడీపీ శ్రేణులు తెలిపారు. దాచేపల్లి, గురజాల, మాచవరం మండలాలకు చెందిన బీసీ సామాజికవర్గాలతో జయహో బీసీ కార్యక్రమానికి యరపతినేని శ్రీనివాసరావు హాజరుకానున్నారు. అదేవిధంగా సాయంత్రం జానపాడు గ్రామంలో బాబు ష్యూరిటీ - భవిష్యత్‌కు గ్యారంటీ కార్యక్రమంలో యరపతినేని పాల్గొననున్నారు.

విద్యుత్ సబ్‌స్టేషన్‌ను ప్రారంభించిన ఎమ్మెల్యే కాసు



విద్యుత్ సబ్‌స్టేషన్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి

మాచవరం ఫిబ్రవరి 2 : మండలంలోని వేమవరం-చెన్నాయపాలెం గ్రామాల మధ్య సుమారు రూ.3 కోట్ల వ్యయంతో నిర్మించిన విద్యుత్ సబ్‌స్టేషన్‌ను గురజాల ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి శుక్రవారం ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ ఎన్నికల ప్రచార సమయంలో రేగులగడ్డ, చెన్నాయపాలెం, వేమవరం గ్రామాల ప్రజలు విద్యుత్ సమస్య తీవ్రంగా వుందని చెప్పడంతో సంబంధిత అధికారులతో మాట్లాడి మంజూరు చేయించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో ఈఈ జె.హరిబాబు, డీఈఈ టి.వీరేశ్వరరావు, ఏఈఈ కేపీ మస్తాన్, జి.సుందరబాబు, పి.రమేష్, అభివృద్ధి కమిటీ చైర్మన్ దారం లక్ష్మీరెడ్డి, జడ్పీటీసీ శివయాదవ్, చౌదరి సింగరయ్య, ఉప ఎంపీపీ చింతపల్లి నన్నేసైదా, సర్పంచ్‌లు గాదె కనకారెడ్డి, మండ్ల మంగమ్మ రామకోటయ్య, జె.వెంకాయమ్మ కొండలు, ఎంపీటీసీలు శానంపూడి శివారెడ్డి, శానంపూడి వీరారెడ్డి, వట్టె రామిరెడ్డి, రాము, సురేష్, పలు గ్రామాల వైసీపీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

దాచేపల్లిలో ఎమ్మెల్యే కాసు పర్యటన

దాచేపల్లి, ఫిబ్రవరి 2 : గురజాల ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి శుక్రవారం దాచేపల్లి మండలంలో పర్యటించారు. తొలుత తంగెడ, ముత్యాలంపాడు గ్రామాలలో ఇంటింటికి ట్యాప్ కనెక్షన్లు, సిమెంట్ రోడ్లకు శంకుస్థాపనలు చేశారు. తక్కెళ్లపాడు, కేశానుపల్లి గ్రామాలలో సీసీ రోడ్లను ప్రారంభించి ఆసరా చెక్కులను పంపిణీ చేశారు. ఆయా కార్యక్రమాలలో మూలగుండ్ల ప్రకాష్‌రెడ్డి, కొప్పుల సాంబయ్య, మందపాటి రమేష్‌రెడ్డి, కోట కృష్ణ, జక్కుల వీరస్వామి, బుర్రి విజయకుమార్‌రెడ్డి, టమాట సుభాని, మునగా పున్నారావు తదితరులున్నారు.

షర్మిలకు మద్దతుగా దీక్ష

దాచేపల్లి, ఫిబ్రవరి 2 : ఏపీ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షురాలు షర్మిల ఢిల్లీలో చేపట్టిన దీక్షకు మద్ధతుగా రాష్ట్ర మైనారిటీ సెల్ కార్యదర్శి కరాలపాటి జాని దాచేపల్లిలో దీక్ష చేపట్టారు. జాని మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదా ఇవ్వాలని, 2014లో చేసిన చట్టాలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఏపీకి అన్యాయం చేస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ రహీం, మాదాసు ఆదినారాయణ, షేక్ హసన్ ఆలీ, నాగరాజు, మల్లయ్య, తదితరులున్నారు.

పల్నాడు ప్రజలను మోసం చేసేందుకు కుల రాజకీయాలు

● టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి బ్రహ్మారెడ్డి



ఆత్మీయ సమ్మేళనంలో మాట్లాడుతున్న బ్రహ్మారెడ్డి

మాచర్ల, ఫిబ్రవరి 2: పల్నాడు ప్రజలను మరోమారు మోసం చేసేందుకు ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి కులరాజకీయాలు చేస్తున్నారని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి జూలకంటి బ్రహ్మారెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. మండలంలోని కొత్తపల్లిలో గురువారం రాత్రి జరిగిన టీడీపీ-జనసేన ఆత్మీయ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. బీసీ కార్డు అంటూ కొత్త నాటకానికి తెరతీస్తున్నారన్నారు. వైసీపీ అభ్యర్థులు ఏ కులాల వారైనా ప్రజలు సమష్టిగా ఓడించాలన్నారు. మాచర్ల పేరును పిన్నెల్లి సోదరులు చెడగొట్టారని మండిపడ్డారు. మైనింగ్, గ్రానైట్, గంజాయి, అక్రమ మద్యంతో పిన్నెల్లి సోదరులు వేల కోట్లు దోచుకున్నారన్నారు. నాలుగుసార్లు గెలిపిస్తే తాగడానికి నీరు లేవు గానీ సందు సందున లిక్కర్ మాత్రం దొరుకుతుందన్నారు. ముందుగా గ్రామానికి చేరుకున్న బ్రహ్మారెడ్డి ఘన స్వాగతం లభించింది. ట్రాక్టర్‌పై బ్రహ్మారెడ్డిని గ్రామంలో ఊరేగించారు. మహిళలు మంగళహారతులతో స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు నేరేటి వీరాస్వామి యాదవ్, జనసేన నియోజకవర్గ అధికార ప్రతినిధి నక్షత్రపు ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేగా ఒక్కసారి అవకాశమివ్వండి

● అరాచకాలను అణచేస్తా : ఇన్‌చార్జి బ్రహ్మారెడ్డి

రెంటచింతల, ఫిబ్రవరి 2 : రాబోయే రోజుల్లో పేదలకు, పెత్తందారులకు యుద్ధం జరగబోతుంది.. ఈ యుద్ధంలో మీరంతా నా వైపు నిలవండి.. నిరంకుశత్వం, దోపీడీ, దౌర్జన్యాలు, దుర్మార్గాలు భరించలేక బిక్కు బిక్కు మంటూ కాలం గడుపుతున్నవారికి స్వేచ్ఛా వాయువులను పీల్చేలా వ్యవహరిస్తా.. ఒక్కసారి ఎమ్మెల్యేగా అవకాశమివ్వండి.. మీ అందరికి అండగా వుంటా అంటూ టీడీపీ మాచర్ల నియోజకవర్గ ఇన్‌చార్జి జూలకంటి బ్రహ్మారెడ్డి అభ్యర్థించారు. శుక్రవారం రెంటచింతలలోని 174 కానుకమాత తిరునాళ్లలో పాల్గొని వెలుగుతున్న కొవ్వొత్తులను సమర్పించి తమ జీవితాల్లో వెలుగులు నింపాలని కోరుకున్నారు. అనంతరం తుమ్మా జోజిరెడ్డి నర్సరీలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ఎమ్మెల్యే సోదరులపై విరుచుకుపడ్డారు. నాలుగు సార్లు ఎమ్మెల్యేగా గెలిచి గ్రామాల్లో తాగునీటి కొరతను నివారించలేపోయారని దుయ్యబట్టారు. చంద్రబాబు నాల్గవసారి సీఎం కాగానే సూపర్ సిక్స్ పథకాలను ఖచ్చితంగా అమలు చేస్తామని హామినిచ్చారు. తుమ్మా జోజిరెడ్డి,ఎం. రాయపరెడ్డి,ఆవుల చిన వెంకటేశ్వర్లు,కొమ్మారెడ్డి శౌర్రెడ్డి,తాయ అనిల్,అడపా బసివిరెడ్డి తదితరులు బ్రహ్మారెడ్డి సమక్షంలో టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. ఈ విలేకరుల సమావేశంలో టీడీపీ మండల అధ్యక్ష,ఉపాధ్యక్షులు అబ్బిరెడ్డి,శ్రీనివాసరావు,సీనియర్ నేత గొంటు ఆదిరెడ్డి,మండల పరిషత్ మాజీ ఉపాధ్యక్షులు గొంటు సుమంత్‌రెడ్డి,టౌన్ అధ్యక్షులు రాజారెడ్డి,చేర్రెడ్డి కృష్ణారెడ్డి,బోడపాటి రామకృష్ణ,బాలయ్య,సిద్దయ్య,అప్పయ్య, మునినాయక్,బుజ్జి,మాణ్యం శ్రీను,నాళం పెద బాబు,సామ్యేల్,జ్ఞానయ్య,సాంబిరెడ్డి,రాయపరెడ్డి,శౌర్రెడ్డి,జనసేనకు చెందిన కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



భక్తులనుద్దేశించి ప్రసంగిస్తున్న నల్గొండ జిల్లా విశ్రాంత బిషప్ గోవిందు జోజి

నేత్రపర్వంగా కానుకమాత తిరునాళ్ల

రెంటచింతల,ఫిబ్రవరి 2 : కానుకమాత 174వ తిరునాళ్ల శుక్రవారం నేత్రపర్వంగా జరిగింది. తిరునాళ్లను పురస్కరించుకుని చర్చిలో ప్రత్యేక పూజలు జరిగాయి. స్థానిక విచారణ గురువులు వైఎల్ మర్రెడ్డి అధ్యక్షతన జరిగిన దివ్యపూజ బలిలో నల్గొండ జిల్లా విశ్రాంత బిషప్ గోవిందు జోజి భక్తులనుద్దేశించి మాట్లాడుతూ కరుణమయి మరియతల్లి తన బిడ్డ ఏసుక్రీస్తును దేవుడికి కానుకగా సమర్పించి తమ దయార్ధ హృదయాన్ని ప్రపంచానికి చాటి చెప్పినట్లు పేర్కొన్నారు. వెలుగుతున్న కొవ్వొత్తులను సమర్పించి భక్తి ప్రపత్తులను చాటుకున్నారు. పురవీధుల్లో తేరు ప్రదర్శన నిర్వహించారు. బాణసంచా మోతలతో పురవీధులు దద్దరిల్లాయి. వేలాది మంది భక్తులు హాజరయ్యారు. విచారణా గురువులు పాపయ్య, ఎలీషారాజ్, ఆగస్టిన్, నిఖిల్, కన్యా స్త్రీలు, కథోలిక సంఘ పెద్దలు పాల్గొన్నారు.

అక్కాచెల్లెమ్మలకు అండగా వైఎస్ఆర్ ఆసరా : పీఆర్కే



చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే పీఆర్కే

మాచర్ల, ఫిబ్రవరి 2: అక్కాచెల్లెమ్మలకు అండగా వైఎస్ఆర్ ఆసరా నిలుస్తోందని ప్రభుత్వ విప్, వైసీపీ జిల్లా అధ్యక్షుడు, మాచర్ల ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. పట్టణంలోని మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన నాలుగో విడత వైఎస్ఆర్ ఆసరా ప్రారంభోత్సవానికి ఆయన హాజరై మాట్లాడారు. మహిళల అభివృద్ధి వైసీపీతోనే సాధ్యమన్నారు. అనంతరం మండల పరిధిలోని 945 స్వయం సహాయక సంఘాల్లోని 9462 మంది లబ్ధిదారులకు రూ.7,99,00,000 విలువైన చెక్కును పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ బూడిద మంగమ్మ, జడ్పీటీసీ మల్లుస్వామి, ఉప ఎంపీపీ పోతిరెడ్డి సుజాత కోటిరెడ్డి, బూడిద శ్రీనివాస్ యాదవ్, సైదులు, కొత్తపల్లి సర్పంచ్ ఓరుగంటి జయప్రకాష్‌రెడ్డి, పీడీ బాలు నాయక్, ఆరికట్ల చంద్రశేఖరరెడ్డి, యంగ్ర గాలయ్య పాల్గొన్నారు.

పల్నాట శాంతి సౌభాగ్యాలు వెల్లివిరియాలి : పీఆర్కే

రెంటచింతల, ఫిబ్రవరి 2 : పల్నాట శాంతి సౌభాగ్యాలు వెల్లివిరియాలని, కరువనేది దరి చేరకూడదని ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి ఆకాంక్షించారు. రెంటచింతలలోని కానుకమాత తిరునాళ్ల సందర్భంగా ఆర్‌సీఎం చర్చిలో ప్రత్యేక పూజలు ప్రార్థనలు చేశారు. అనంతరం వెలుగుతున్న కొవ్వొత్తులను కానుకమాతకు సమర్పించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే సోదరుడు వెంకట్రామిరెడ్డి, వైసీపీ మండల కన్వీనర్ గొట్టం బ్రహ్మారెడ్డి, మండల పరిషత్ అధ్యక్ష, ఉపాధ్యక్షులు చౌడేశ్వరీ, శౌర్రెడ్డి, మాజీ సర్పంచ్ అల్లం ప్రతాపరెడ్డి, మార్కెట్ యార్డు మాజీ వైస్ చైర్మన్ ఆదూరి ఇన్నారెడ్డి, మండల మాజీ కన్వీనర్ పూజల రామయ్య, వైసీపీ యూత్ అధ్యక్షులు సతీష్‌రెడ్డి, జిల్లా జేసీఎస్ కన్వీనర్ మోర్తల ఉమ, మాజీ జడ్పీటీసీ భాస్కరరెడ్డి, ఏరువ భాస్కరరెడ్డి, ముత్తయ్య యాదవ్, ఇన్నారెడ్డి, ప్రతాపరెడ్డిపాల్గొన్నారు.

కారంపూడి ఎంపీపీగా బొమ్మిన సావిత్రి అల్లయ్య

కారంపూడి, ఫిబ్రవరి 2: కారంపూడి ఎంపీపీగా బొమ్మిన సావిత్రి అల్లయ్య శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి హాజరై ఎంపీపీని దుశ్శాలువలతో సన్మానించి అభినందించారు. ఎంపీపీ సావిత్రి అల్లయ్య మాట్లాడుతూ తనకు నమ్మకంతో ఈ పదవి కేటాయించిన పిన్నెల్లి సోదరులకు రుణపడి ఉంటానన్నారు. ఈ కార్యక్రమంలో వైసీపీ నేతలు కొంగర సుబ్రహ్మణ్యం, కొమ్మిరెడ్డి ఎర్ర గురవారెడ్డి, షేక్ ఆరీఫ్ పాల్గొన్నారు.

గురజాల ఎంపీడీవోగా రామకృష్ణ నాయక్

గురజాలటౌన్, ఫిబ్రవరి 2: గురజాల మండల పరిషత్ అధికారిగా రామకృష్ణ నాయక్ శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఈయన కృష్ణా జిల్లా ఇబ్రహీంపట్నం నుంచి గురజాలకు వచ్చారు. ఇక్కడ విధులు నిర్వహించిన ఫణికుమార్ ప్రకాశం జిల్లాకు బదిలీపై వెళ్లారు.

దుర్గి ఎంపీడీవోగా చిన్నారావు

దుర్గి, ఫిబ్రవరి 2: దుర్గి ఎంపీడీవోగా సీహెచ్ చిన్నారావు శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. కృష్ణా, గోదావరి మిషన్ గంగా ప్రాజెక్ట్‌లో ఈయన డిప్యూటి కమిషనర్‌గా విధులు నిర్వహించారు. ఇప్పటి వరకు విధులు నిర్వహించిన సమతావాణి బాపట్లకు బదిలీపై వెళ్లారు.

టీడీపీ నేత ద్విచక్ర వాహనం దహనం

మాచర్ల, ఫిబ్రవరి 2 : మండలంలోని కొత్తపల్లిలో గురువారం రాత్రి గ్రామానికి చెందిన టీడీపీ నేత ద్విచక్ర వాహనాన్ని గుర్తు తెలియని వ్యక్తులు దహనం చేశారు. బ్రహ్మారెడ్డి నిర్వహించిన టీడీపీ-జనసేన ఆత్మీయ సమ్మేళనం ముగిసిన తరువాత ఈ సంఘటన జరిగింది. టీడీపీ, జనసేన కలయిక ఓర్వలేకే వైసీపీ నేతలు ఇటువంటి దుశ్చర్యలకు పాల్పడుతున్నారని టీడీపీ నేతలు ఆగ్రహం వ్యక్తం చేశారు.

బెల్లంఊట ధ్వంసం

దుర్గి, ఫిబ్రవరి 2: మండలంలోని నెహ్రూనగర్ తండా సమీపంలో శుక్రవారం సెబ్ అధికారులు దాడులు నిర్వహించారు. నాటుసారా తయారీకి సిద్ధంగా ఉంచిన 300 లీటర్ల బెల్లంఊటను ధ్వంసం చేశారు.

అరాచకాలతో అధికారంలోకి రావాలని చూస్తున్న జగన్

● మాజీ ఎమ్మెల్యే కొమ్మాలపాటి విమర్శ

క్రోసూరు, ఫిబ్రవరి 2 : అరాచకాలు, అలజడులు సృష్టించి మళ్లీ అధికారంలోకి రావాలని ముఖ్యమంత్రి జగన్ ప్రయత్నిస్తున్నాడని, తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు అప్రమత్తంగా ఉండాలని మాజీ ఎమ్మెల్యే కొమ్మాలపాటి శ్రీధర్ అన్నారు.క్రోసూరులో శుక్రవారం ఆయన పర్యటించారు. ఇటీవల అగ్ని ప్రమాదం జరిగిన మండల టీడీపీ మాజీ అధ్యక్షుడు కూరపాటి సైదాకు చెందిన పత్తి గోడౌన్‌ను ఆయన పరిశీలించారు కూరపాటి సైదాను పరామర్శించి ప్రమాదం జరిగిన విధానాన్ని అడిగి తెలుసుకున్నారు. రెండు నెలల లోపే సైకో ప్రభుత్వం పోయి రాష్ట్రానికి విముక్తి కలుగుతుందని ఆయన భరోసా ఇచ్చారు. పెదకూరపాడు నియోజకవర్గంలో అవినీతి రాజ్యమేలుతుందని అన్నారు. ఆయన వెంట టీడీపీ నాయకుడు, మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ ఏపూరి నాగేశ్వరరావు, టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు నలజాల సదాశివరావు, మాజీ ఎంపీపీ అనుముల వెంకట రామిరెడ్డి, విప్పర్ల మాజీ సర్పంచ్ కొండవీటి శ్రీనివాసరావు, టీడీపీ ఆర్యవైశ్య నాయకులు అనుమాల పూర్ణ, ఎస్సీ సెల్ జిల్లా నాయకుడు దుద్దుల యోహాన్, తెలుగు యువత నాయకులు షేక్ సలాం, గోగిశెట్టి వెంకటరావు, బంగారు మైసూరు బాబు, తెలుగు మహిళ రాష్ట్ర అధికార ప్రతినిధి వేగుంట రాణి, నలజాల కోటేశ్వరరావు, మల్లాల రామాంజనేయులు తదితరులు ఉన్నారు.

విద్యా రంగంలో మార్పులను అందిపుచ్చుకోవాలి

సత్తెనపల్లి, ఫిబ్రవరి 2 : విద్యా రంగంలో వస్తున్న విప్లవాత్మక మార్పులను ఉపాధ్యాయులు అంది పుచ్చుకోవాలని డిప్యూటీ ఈవో వీ.వెంకటేశ్వర్లు అన్నారు. పట్టణంలోని సుగాలీ కాలనీ ఉన్నత పాఠశాల ఆవరణలో శుక్రవారం సత్తెనపల్లి సబ్ డివిజన్‌లోని వివిధ పాఠశాలల్లో పని చేస్తున్న గణిత ఉపాధ్యాయులకు ఇన్ఫర్మేషన్ కమ్యూనికేషన్ అండ్ టెక్నాలజీ సిమ్యులైజేషన్‌పై శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో రాఘవేంద్రరావు, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు లత ప్రియదర్శిని, రిసోర్స్ పర్సన్ నరేంద్ర, శ్రీనివాసరావు, బాలకృష్ణారెడ్డి, సత్తెనపల్లి సబ్ డివిజన్‌లోని వివిధ మండలాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


ఆరోగ్యశ్రీ కార్డుల ఈకేవైసీని పరిశీలించిన డీఎస్‌వో

క్రోసూరు, ఫిబ్రవరి 2 : మండలంలోని పీసపాడులో ఆరోగ్యశ్రీ కార్డుల ఈకేవైసీ నమోదును జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారి, మండల ప్రత్యేక అధికారి పద్మశ్రీ శుక్రవారం పరిశీలించారు. ఇంటింటికి తిరిగి కార్డులు అందాయా? లేదా? అన్న విషయాన్ని విచారణ జరిపారు. అనంతవరంలో జరిగిన వైద్య శిబిరాన్ని సందర్శించారు. 88 తాళ్ళూరు సచివాలయాన్ని సందర్శించి పీఎంజేఏవై, కులగణన సమావేశంలో పాల్గొన్నారు. కులగణన సర్వేను సాధ్యమైనంత త్వరగా పూర్తి చేయాలని ఆమె కోరారు. అనంతవరంలో జరిగిన ఆరోగ్య శిబిరానికి 169 మంది హాజరైనట్టు చెప్పారు. ఆమె వెంట ఇన్‌చార్జ్ ఎంపీడీవో శివరామయ్య, వైద్యాధికారులు డాక్టర్ రాజేష్, డాక్టర్ సిరి చందన, వైద్య ఆరోగ్య శాఖ అధికారి శిఖా శ్యామ్‌సన్, హెల్త్ సూపర్‌వైజర్ ప్రభావతి, పలువురు మండల అధికారులు పాల్గొన్నారు.

పది పరీక్షలపై అవగాహన సదస్సు

పిడుగురాళ్ల, ఫిబ్రవరి 2 : పిడుగురాళ్ల ఎంపీజడ్పీహెచ్ స్కూల్ 1984-85 పూర్వవిద్యార్థుల ఆధ్వర్యంలో 10వ తరగతి పబ్లిక్ పరీక్షలపై శనివారం విద్యార్థులకు అవగాహన సదస్సు జరుపుతున్నట్లు పూర్వ విద్యార్థుల సంఘం తెలిపింది. పిడుగురాళ్ల, మాచవరం, రాజుపాలెం మండలాలకు చెందిన పది విద్యార్థులకు వివిధ సబ్జెక్టులలో నిపుణులైన ఉపాధ్యాయులతో శనివారం వాసవి కన్యకాపరమేశ్వరి కల్యాణ మండపంలో అవగాహన కల్పించబడునని నిర్వాహకులు తెలిపారు.

రాజుపాలెం మండల కాపు సంఘం అధ్యక్షుడిగా పులిబండ్ల



సాంబశివరావు

రాజుపాలెం, ఫిబ్రవరి 2 : రాజుపాలెం మండల కాపు సంఘం అధ్యక్షుడిగా రాజుపాలెం గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ పులిబండ్ల సాంబశివరావు ఏకగ్రీవంగా ఎన్నికైయ్యారు. జిల్లా అధ్యక్షుడు పోలిశెట్టి వెంకట సత్యనారాయణ ఆధ్వర్యంలో రాజుపాలెంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మండలంలోని అన్ని గ్రామాలకు చెందిన కాపులు హాజరయ్యారు. సాంబశివరావు మాట్లాడుతూ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసి విజయవంతం చేసేందుకు కృషి చేసిన గంగిరెడ్డిపాలెం సర్పంచ్ ఆసుల జగన్‌కు ప్రత్యేక అభినందనలు తెలిపారు.

నేడు మొక్కపాడులో ఎన్నికల శంఖారావం

రాజుపాలెం, ఫిబ్రవరి 2 : మండలంలోని మొక్కపాడు గ్రామంలో తెలుగుదేశం, జనసేన పార్టీల ఉమ్మడి నియోజకవర్గ అభ్యర్థి కన్నా లక్ష్మీనారాయణ శనివారం సాయంత్రం ఎన్నికల శంఖారావం నిర్వహించనున్నట్లు ఆ పార్టీల మండల అధ్యక్షులు పల్లపాటి పెద్దిరాజు, తోట నరసయ్య తెలిపారు. శుక్రవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ కార్యక్రమంలో ఉమ్మడి పార్టీల నాయకులు, కార్యకర్తలు, అభిమానులందరూ పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

కొనసాగిన బొర్రా పాదయాత్ర

సత్తెనపల్లి, ఫిబ్రవరి 2 : జనసేన నియోజకవర్గ సమన్వయ కర్త బొర్రా వెంకట అప్పారావు చేజర్ల వరకు చేపట్టిన పాదయాత్ర శుక్రవారం పట్టణంలోని వడ్డవల్లి నుంచి ధూళిపాళ్ళ వరకు కొనసాగింది. జనసేన, తెలుగుదేశం కూటమిని ప్రజలు ఆదరించాలని పాదయాత్రలో ఆయన ప్రజలను కోరారు. జనసేన నేతలు కొమ్మిశెట్టి వెంకట సాంబశివరావు, రంగిశెట్టి సుమన్, బత్తుల కేశవ, తోట నరసయ్య, పలువురు జనసేన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బీసీల గెలుపు కోసం కృషి చేయాలి

మాచవరం, ఫిబ్రవరి 2 : రానున్న ఎన్నికలలో వైసీపీ తరుపున బీసీ అభ్యర్థుల గెలుపునకు ప్రతి ఒక్కరు కృషి చేయాల్సిన అవసరం ఉందని మండల బీసీ సంఘ నాయకులు పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో జడ్పీటీసీ శివయాదవ్, బీసీ సెల్ మండల అధ్యక్షుడు సురేష్, మార్కెట్ యార్డు డైరెక్టర్ ముండ్లపాటి రాము, ఉపసర్పంచ్ ఆంజనేయులు, మాచవరం సర్పంచ్ నరేష్, రేగులగడ్డ సర్పంచ్ అలవాల వెంకటేశ్వర్లు, తిక్కా నాగేశ్వరరావు, పాల్గొన్నారు.

రాజ్యాంగ హక్కులను కాల రాస్తున్న సీఎం జగన్

● మాజీ ఎమ్మెల్యే కొమ్మాలపాటి శ్రీధర్

పెదకూరపాడు, ఫిబ్రవరి 2 : రాష్ట్రంలో పాలన అస్తవ్యస్తమని, రాజ్యాంగ హక్కులను ముఖ్యమంత్రి కాలరాస్తున్నారని మాజీ ఎమ్మెల్యే కొమ్మాలపాటి శ్రీధర్ అన్నారు. పెదకూరపాడులో శుక్రవారం బూత్ ఇన్‌చార్జ్‌లు, యూనిట్, క్లస్టర్ ఇన్‌చార్జ్‌లకు ఇంటిగ్రేటెడ్ శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీధర్ మాట్లాడుతూ రాజ్యాంగం కల్పించిన హక్కులను కాలరాస్తూ చట్టాన్ని, న్యాయాన్ని పట్టించు కోకుండా జగన్‌మోహన్‌రెడ్డి దుర్మార్గానికి పాల్పడుతున్నాడని, తన అరాచకాన్ని ప్రశ్నిస్తే ప్రతిపక్ష నేతల పై తప్పుడు కేసులు పెడుతూ దాడులు చేస్తున్నారన్నారు. ఇంటిగ్రేటెడ్ శిక్షణ ద్వారా టీడీపీ శ్రేణులు మరింత ముందుకు వెళ్లాలన్నారు. ఈ కార్యక్రమంలో శిక్షకులు మద్దిరాల గంగాధర్, కనుమూరి లక్ష్మి, రావర్ల రమేష్, అప్పారావు, సుధీర్, టీడీపీ మండల అధ్యక్షుడు అర్తిమళ్ళ రమేష్, తెలుగు రైతు జిల్లా ప్రధాన కార్యదర్శి భాష్యం ఆంజనేయులు, డిస్ట్రిబ్యూటరీ కమిటీ మాజీ చైర్మన్ వడ్లమూడి అప్పారావు, టీడీపీ జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి షేక్ ముంతాజ్, షేక్ అజ్మల్లా, వడ్లమూడి అప్పారావు, ఏరువ బాలిరెడ్డి, వెల్లలచెరువు సురేష్, మల్లాది విష్ణు, షేక్ జానీ ఉన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే కొమ్మాలపాటి శ్రీధర్

● అచ్చంపేట, ఫిబ్రవరి 2 : క్లస్టర్ ఇన్‌చార్జ్‌లు, బూత్ కన్వీనర్లు, యూనిట్ ఇన్‌చార్జ్‌లు ప్రణాళికా బద్ధంగా, సమర్థవంతంగా పని చేయాలని మాజీ ఎమ్మెల్యే డాక్టర్ కొమ్మాలపాటి శ్రీధర్ పిలుపు నిచ్చారు. స్థానిక సాయిబాబా కల్యాణ మందిరంలో శుక్రవారం అచ్చంపేట, క్రోసూరు, బెల్లంకొండ మండలాలకు చెందిన క్లస్టర్ ఇన్‌చార్జ్‌లు, బూత్ కన్వీనర్లు, యూనిట్ ఇన్‌చార్జ్‌లకు ఎన్నికలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న డాక్టర్ కొమ్మాలపాటి శ్రీధర్ మాట్లాడుతూ ఇంటిగ్రేటెడ్ శిక్షణలో బాబు ష్యూరిటీ.. భవిష్యత్తుకు గ్యారెంటీ, ఓటర్ల జాబితా, మన టీడీపీ యాప్, కుటుంబ సాధికారిత సారధులపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో మూడు మండలాలకు చెందిన 23 యూనిట్ సభ్యులు, ఐదు క్లస్టర్, 176 పోలింగ్ బూత్‌ల పరిధిలోని వారు పాల్గొన్నారు. శిక్షణను అందించిన వారిలో మద్దిరాల గంగాధర్, మానుకొండ మల్లిబాబు, సుధీర్, ఎస్‌కే హజారుద్దీన్, అచ్చంపేట మండల అధ్యక్షుడు నందిగం ఆశీర్వాదం, ఎస్‌కే చిన జానీ బాషా, నల్లమేకల లక్ష్మీనారాయణ, బత్తుల శ్రీనివాసరావు, జువ్వా రామారావు, వెనిగండ్ల కోటయ్య తదితరులు పాల్గొన్నారు.

తెలుగు యువత ఆధ్వర్యంలో నిరసన



అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న తెలుగు యువత నేతలు

సత్తెనపల్లి, ఫిబ్రవరి 2 : నిరుద్యోగ యువతీ, యువకుల పట్ల ప్రభుత్వం అవలంబిస్తున్న వైఖరికి నిరసనగా తెలుగు యువత ఆధ్వర్యంలో తాలూకా సెంటర్‌లోని అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన ప్రదర్శన చేశారు. చెవిలో పూలు ధరించి ప్రభుత్వ వైఖరిపై నిరసన వ్యక్తం చేశారు. వేలాది టీచర్ల పోస్టులు భర్తీ చేస్తామని, మెగా డీఎస్సీ వేస్తామని చెప్పిన వైఎస్ జగన్ ఐదు సంవత్సరాల కాలంలో ఒక్క డీఎస్సీ కూడా వేయలేదన్నారు. నెల రోజుల్లో సీఎం కుర్చీ దిగే తరుణంలో నిరుద్యోగ యువతను మోసం చేసేందుకు డీఎస్సీని విడుదల చేశారన్నారు. జగన్ ప్రభుత్వాన్ని గద్దె దింపటానికి నిరుద్యోగ యువత అంతా సిద్ధంగా ఉన్నారన్నారు. అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో తెలుగు యువత నేతలు వక్కంటి అజయ్ కుమార్, చిన్నబోయిన రాఘవ యాదవ్, సదాశివరావు, జోరిగె శ్రీనివాసరావు, నాగం కార్తీక్, ముత్తినేని నరేంద్ర, మల్లికార్జునరావు, నారాయణ, రామారావు, ఆదాం రఫీ, సాంబ, ఉమర శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

దళితులను దగా చేసిన జగన్‌మోహన్‌రెడ్డి

● టీడీపీ ఎస్సీ నాయకులు

సత్తెనపల్లి రూరల్, ఫిబ్రవరి 2 : ఎస్సీల 27 పథకాలు రద్దు చేసి దళితులను ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి దగా చేశారని టీడీపీ ఎస్సీ నాయకులు అన్నారు. నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి, మాజీ మంత్రి కన్నా లక్ష్మీనారాయణ ఆదేశాల మేరకు పట్టణంలోని గర్నెపూడిలో గ్రామ టీడీపీ ఆధ్వర్యంలో శుక్రవారం దళిత చైతన్య యాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు ఇంటింటికి వెళ్ళి జగన్ ప్రభుత్వం ఎస్సీలను మోసం చేసిన విధానాన్ని వివరించారు. ప్రభుత్వం రద్దు చేసిన 27 ఎస్సీల పథకాలతో కూడిన కరపత్రాలను ఎస్సీ కాలనీలో పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో బద్దుల శివరామకృష్ణ, నల్లబోతుల హనుమంతరావు, పురం సుందరరావు, తురుమెళ్ళ కోటేశ్వరరావు, కుంచర్ల జోసెఫ్, భాస్కరరావు, బొక్కా సంగీతరావు, గుంటూరు ఆశీర్వాదం, శనగపూల నరసింహారావు, వెలిశాల వెంకటరావు, బండారు ఏలియా, రామాంజనేయులు పాల్గొన్నారు.

జీవీని కలసిన మల్లవరపు

సత్తెనపల్లి, ఫిబ్రవరి 2 : తెలుగు యువత జిల్లా కార్యదర్శిగా నియమితులైన మల్లవరపు కిషోర్ శుక్రవారం టీడీపీ జిల్లా అధ్యక్షుడు జీవీ ఆంజనేయులును మర్యాద పూర్వకంగా కలసి పుష్పగుచ్ఛం అందించారు. సత్తెనపల్లి నియోజకవర్గంలో తెలుగు యువత అభివృద్ధికి కృషి చేయాలని జీవీ ఆంజనేయులు సూచించినట్టు కిషోర్ తెలిపారు. కిషోర్‌తో పాటు ఆంజనేయులును కలసిన వారిలో షేక్ సైదా, సయ్యద్ అన్వర్, పఠాన్ రఫీ తదితరులు ఉన్నారు.

సీఎం తక్షణమే వివరణ ఇవ్వాలి : సీపీఐ

సత్తెనపల్లి, ఫిబ్రవరి 2 : రైల్వే శాఖ మంత్రి అశ్వనీ వైష్ణవ్ చేసిన ఆరోపణలపై ఉత్తరాంధ్ర అభివృద్ధిపై మొసలి కన్నీరు కార్చుస్తున్న సీఎం జగన్ తక్షణమే స్పందించి వివరణ ఇవ్వాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు నరిచేటి వేణుగోపాల్ కోరారు. ఆయన శుక్రవారం విలేకరులతో మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం 54 ఎకరాల భూమిని కేటాయించకపోవటం వల్లే రైల్వే జోన్ ఏర్పాటు చేయలేకపోయామని రైల్వే శాఖ మంత్రి చెప్పారన్నారు. దీనిపై ముఖ్యమంత్రి స్పందించాల్సిన అవసరం ఉందన్నారు. రైల్వే డివిజన్ ఏర్పాటు చేయటం వల్ల ఎంతో మేలు జరుగుతుందన్నారు. రాష్ట్ర విడిపోయి పది సంవత్సరాలు గడుస్తున్నా రైల్వే రిక్రూట్‌మెంట్ బోర్డును ఆంధ్రప్రదేశ్‌లో నెలకొల్పాలనే ఆలోచన కేంద్ర ప్రభుత్వానికి రాలేదన్నారు. రాష్ట్రాభివృద్ధిపై అసత్య ప్రచారాలు, కల్లబొల్లి మాటలు కట్టిపెట్టి రాష్ట్ర సమగ్ర అభివృద్ధికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కృషి చేయాలని కోరారు.

జడ్పీ హైస్కూల్‌కు త్రీఫేజ్ విద్యుత్

పెదకూరపాడు, ఫిబ్రవరి 2 : మండలంలోని 75 తాళ్ళూరు జడ్పీ హైస్కూల్‌కు త్రీఫేజ్ విద్యుత్ సప్లయ్ సమకూర్చినట్టు విద్యా కమిటీ చైర్మన్ గుత్తికొండ శ్రీనివాసరెడ్డి శుక్రవారం తెలిపారు. హైస్కూల్‌లో ఐఎఫ్‌పి టీవీలు, ఫ్యాన్‌లు, డిజిటల్ క్లాసులు, మంచి నీటి మోటార్లతో విద్యుత్ వాడకం పెరిగిందని, సింగిల్ ఫేజ్ కారణంగా లోవోల్టేజితో ఇబ్బంది పడటంతో పూర్వ విద్యార్థులు యన్నం కృష్ణారెడ్డి, అక్కిరెడ్డి త్రీఫేజ్ విద్యుత్ కల్పించినట్టు వివరించారు.

పల్నాడు వార్తలు

◆ నరసరావుపేట ◆ వినుకొండ ◆ చిలకలూరిపేట



డీఆర్‌వో కే వినాయకంకు వినతి పత్రం అందజేస్తున్న టీడీపీ, బీజేపీ, జనసేన నాయకులు

డబుల్ ఎంట్రీ ఓట్లను తొలగించాలి

● టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి రాపర్ల జగ్గారావు

నరసరావుపేట టౌన్, ఫిబ్రవరి 2: వినుకొండ నియోజకవర్గంలో పలు పోలింగ్ స్టేషన్లలో శాశ్వతంగా వలసపోయిన, చనిపోయిన, డబుల్ ఎంట్రీ ఓట్లను తొలగించాలని టీడీపీ పల్నాడు జిల్లా అధికార ప్రతినిధి రాపర్ల జగ్గారావు కోరారు. శుక్రవారం పల్నాడు జిల్లా కలెక్టర్ కార్యాలయంలో డీఆర్‌వో కే వినాయకంను కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా రాపర్ల జగ్గారావు మాట్లాడుతూ వినుకొండ నియోజకవర్గంలో గుర్తించిన శాశ్వతంగా వలసవెళ్లిన, చనిపోయిన, డబుల్ ఎంట్రీలను గుర్తించి ఫామ్ 7 దరఖాస్తు చేసినప్పటకి బీఎల్‌వోలు, ఏఈఆర్‌వోలు ఫామ్ 7లపై విచారణ చేయకుండా తిరస్కరిస్తున్నారని అన్నారు. కొన్ని బూత్‌లలో అధికారపార్టీ ఒత్తిళ్ల మేరకు ఒక్కో మనిషికి రెండు మూడు ఓట్లు ఇచ్చారన్నారు. వినుకొండ నియోజకవర్గం నుంచి ఇతర నియోజకవర్గంలో ఉన్న ఓటర్లను గుర్తించి ఫాం7 దరఖాస్తు చేసినప్పటకీ బీఎల్వోలు, ఏఈఆర్‌వోలు ఎటువంటి చర్యలు తీసుకోవడం లేదన్నారు. ఈ మేరకు ఆధారాలతో సహా అందజేశారు. కార్యక్రమంలో బీజేపీ నియోజకవర్గ కన్వీనర్ రంగిశెట్టి రామకృష్ణ, జనసేన నియోజకవర్గ అధికార ప్రతినిధి షేక్ అబ్దుల్ రవూఫ్, శేఖర్ పాల్గొన్నారు.

యువత ఓటుతో రాష్ట్రాన్ని పునర్‌నిర్మించుకోవాలి

● టీడీపీ యువనేత డాక్టర్ కడియాల లలిత్ సాగర్

నరసరావుపేట టౌన్, ఫిబ్రవరి 2: యువత తమ ఓటుతో రాష్ట్రాన్ని పునర్ నిర్మించుకోవాలని టీడీపీ యువ నాయకుడు డాక్టర్ కడియాల లలిత్‌సాగర్ అన్నారు. శుక్రవారం నరసరావుపేటలోని పల్నాడు టీడీపీ కార్యాలయంలో మీడియా సమావేశం జరిగింది. ఈ సందర్భంగా డాక్టర్ కడియాల లలిత్‌సాగర్ మాట్లాడుతూ దేశం దశ, దిశ మార్చే అస్త్రం ఓటు అని, రాజ్యాంగం కల్పించిన ఓటు హక్కు ద్వారా ప్రభుత్వాలను, పాలకులను ఎన్నుకునే గొప్ప అవకాశం ఉందన్నారు. రాబోయే ఎన్నికలలో మొదటిసారి ఓటు వేసే యువత రాష్ట్రాభివృద్ధికి తోడ్పడే, నిరుద్యోగ సమస్యలు, విద్య, వైద్యం, న్యాయ, భద్రత అందించగలిగే వారికే తమ ఓటు వేయాలని పిలుపునిచ్చారు. యువత కష్టపడి చదివి తెచ్చుకున్న డిగ్రీలకు ఉపయోగం లేకుండా పోతుందని, రాష్ట్రంలో ఉద్యోగాలు లేక యువత డ్రగ్స్, మద్యానికి బానిసలుగా మారుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సమావేశంలో రావెల జ్ఞానకోటేశ్వరరావు, తెలుగు యువత జిల్లా అధ్యక్షుడు కుమ్మెత కోటిరెడ్డి, టీఎన్ఎస్ఎఫ్ అధ్యక్షుడు కె.హనుమంతురావు, దాసరి ఉదయశ్రీ, పొనుగోటి శ్రీనివాసరావు, గంగిరెడ్డి శ్రీనివాసరెడ్డి, భార్గవ్‌సాయి, తదితరులు పాల్గొన్నారు.

మద్యం సీసాలు కలిగిఉన్న నిందితుడు అరెస్టు

నరసరావుపేట లీగల్, ఫిబ్రవరి 2: అక్రమంగా ఎనిమిది మద్యం సీసాలు కలిగి ఉన్న మండలంలోని ఇక్కుర్రుకు చెందిన నాగేశ్వరరావును శుక్రవారం సాయంత్రం అరెస్టు చేసినట్టు నరసరావుపేట స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో సీఐ నయనతార తెలిపారు. పట్టణంలో నిందితులు ఎనిమిది మద్యం సీసాలతో సంచరిస్తుండగా దాడిచేసి అరెస్టు చేసినట్టు తెలిపారు.

కృష్ణవేణి మహిళా ఇంజనీరింగ్ విద్యార్థులకు ఉద్యోగాలు

నరసరావుపేట టౌన్, ఫిబ్రవరి 2: స్థానిక కృష్ణవేణి మహిళా ఇంజనీరింగ్ కళాశాలలో శుక్రవారం ఆల్‌సెక్ టెక్నాలజీస్ సంస్థ క్యాంపస్ డ్రైవ్ నిర్వహించారు. కంప్యూటర్ సైన్స్ చదువుతున్న విద్యార్థులకు గ్రూప్ డిస్కషన్, పర్సనల్ ఇంటర్వ్యూలు నిర్వహించి 35మంది విద్యార్థులకు ఉద్యోగాలకు ఎంపికచేశారు. ఎంపికైన విద్యార్థికి వార్షిక వేతనం రూ.2.20లక్షలు ఉంటుందని కళాశాల ప్రిన్సిపాల్ సాదినేని రామారావు తెలిపారు. ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులను కళాశాల డైరెక్టర్ దరువూరి శ్రావ్య, ఛైర్మన్ మేదరమెట్ల రామశేషగిరిరావు, ప్లేస్‌మెంట్ ఆఫీసర్ జె రవిశంకర్, అధ్యాపకులు అభినందించారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

నరసరావుపేట రూరల్, ఫిబ్రవరి 2: పట్టణంలోని విద్యుత్ సబ్‌స్టేషన్‌లలో మరమ్మతుల దృష్ట్యా శనివారం ఉదయం 9గంటల నుంచి సాయంత్రం 4గంటల వరకు విద్యుత్ అంతరాయం ఏర్పడనుందని విద్యుత్ శాఖ ఈఈ శ్రీనివాసరావు తెలిపారు. పట్టణంలోని బాపనయ్య నగర్, షాలెంనగర్, రెడ్లబజారు, రిక్షాసెంటరు, టౌన్‌హాలు, సెయింట్‌ఆన్స్ స్కూలు, కంబంపాలెం, కడియాల హాస్పటల్, రిజిష్టార్ కార్యాలయం తదితర ప్రాంతాలలో విద్యుత్ అంతరాయం ఏర్పడుతుందన్నారు.

డీఎస్సీలో అప్రంటీస్ విధానం తగదు: రామిరెడ్డి

వినుకొండ, ఫిబ్రవరి 2: డీఎస్సీ నోటిఫికేషన్‌లో అప్రంటీస్ విధానాన్ని రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టడాన్ని ఎస్టీయూ వ్యతిరేకిస్తున్నట్లు జిల్లా అధ్యక్షుడు ఎల్‌వీ రామిరెడ్డి తెలిపారు. స్థానిక ఎస్టీయూ కార్యాలయంలో ఎస్టీయూ వార్షిక సమావేశంలో శుక్రవారం నిర్వహించారు. సమావేశానికి ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ ప్రతిఏటా ఉద్యోగ నోటిఫికేషన్‌లను విడుదల చేస్తామని చెప్పి ఎన్నికల హామీ మేరకు అప్రంటీస్ విధానం లేకుండా అన్ని ఉపాధ్యాయ ఖాళీలను భర్తీ చేసేలా మెగా డీఎస్సీ నోటిఫికేషన్‌ను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. జిల్లా ప్రధాన కార్యదర్శి చంద్రజిత్‌యాదవ్ మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి సీపీఎస్‌ను రద్దు చేయకపోగా జీపీఎస్ అంటూ కొత్త విధానాన్ని తెరమీదకు తెచ్చి ఉపాధ్యాయుల గొంతు కోశారని ఆరోపించారు. అనంతరం వినుకొండ, శావల్యాపురం విద్యాశాఖ అధికారులు జప్రుల్లా, సాంబశివరావుతో పాటు ప్రమోషన్ పొందిన ఉపాధ్యాయులను సన్మానించారు.

వినుకొండ ఎంపీడీవోగా దేవండ్ల నర్సయ్య



వినుకొండటౌన్, ఫిబ్రవరి 2: వినుకొండ ఎంపీడీవోగా దేవండ్ల నర్సయ్య శుక్రవారం విధుల్లో చేరారు. ప్రకాశం జిల్లా కొమ్మురోలు ఎంపీడీవోగా పనిచేస్తూ ఎన్నికల విధుల్లో భాగంగా వినుకొండకు బదిలీ అయినట్లు ఆయన తెలిపారు. నూతనంగా విధుల్లో చేరిన ఎంపీడీవో నర్సయ్యను ప్రజాప్రతినిధులు, కార్యాలయ సిబ్బంది అభినందనలు తెలిపారు.



ద్వితీయస్థానం సాధించిన శావల్యాపురం మహిళ క్రికెట్ జట్టు

జిల్లాలో శావల్యాపురం మహిళ క్రికెట్ జట్టుకు ద్వితీయస్థానం

శావల్యాపురం, ఫిబ్రవరి 2: ఆడుదాం-ఆంధ్ర జిల్లాస్థాయి క్రికెట్ పోటీలలో శావల్యాపురం మండలానికి చెందిన మహిళల క్రికెట్ జట్టు అత్యున్నత ప్రతిభ కనబరచి ద్వితీయస్థానంలో నిలిచినట్లు మండల స్పోర్ట్స్ కో-ఆర్డినేటర్ రాగుల రాధాకృష్ణ మూర్తి శుక్రవారం తెలిపారు. అయన మాట్లాడుతూ నరసరావుపేటలోని మున్సిపల్ స్టేడియంలో గురువారం జరిగిన ఫైనల్‌లో శావల్యాపురం మండలం జట్టు, నాదెండ్ల మండలం జట్టు పోటీపడగా నాదెండ్ల మండలం జట్టు ప్రథమస్థానాన్ని, శావల్యాపురం మండలం జట్టు ద్వితీయస్థానాన్ని సాధించాయన్నారు. ద్వితీయస్థానంలో నిలిచిన శావల్యాపురం మండల జట్టుకు రూ.30వేల నగదు బహుమతిని ప్రభుత్వం జట్టు సభ్యుల బ్యాంక్ ఖాతాలకు త్వరలో జమచేస్తుందని, ప్రశంసాపత్రాలు, మెమొంటోలను శనివారం జిల్లా కలెక్టర్ లోతేటి శివశంకర్ అందజేస్తారన్నారు. ద్వితీయస్థానంలో నిలిచిన జట్టుసభ్యులను ఎంపీడీవో కొర్రపాటి కవితా చౌదరి, పీడీలు రాధాకృష్ణ, రాజేష్, మణి, సుజాత, ఉపాధ్యాయులు నాగమల్లేశ్వరి, ఆదాంఖాన్, మహిళా పోలీస్‌లు అభినందించారు.

మతుకుమల్లిలో ఎస్సీ, ఎస్టీ కేసుపై డీఎస్పీ విచారణ

మతుకుమల్లి (శావల్యాపురం) ఫిబ్రవరి 2: మండలంలోని మతుకుమల్లి గ్రామంలో జనవరి 30వ తేదీన నమోదైన ఎస్సీ, ఎస్టీ కేసుపై ఎస్సీ, ఎస్టీ సెల్ డీఎస్పీ షేక్ సైపుద్దీన్ శుక్రవారం క్షేత్రస్థాయిలో విచారణ చేపట్టారు. మతుకుమల్లి ఎస్సీ కాలనీకి చెందిన మందా విజయరాజు అదే గ్రామానికి చెందిన రావులపల్లి వీరాంజనేయులు పొలంలో కంది మండలు విరిచాడని తెలియడంతో అడిగేందుకు వెళ్ళిన వీరాంజనేయులు, ఆయన కుటుంబ సభ్యులు విజయరాజును కులం పేరుతో దూషించారని బాధితులు స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా ఎస్‌ఐ తుళ్ళూరి తిరుపతిరావు కేసు నమోదు చేశారు. దీనిపై డీఎస్పీ సైపుద్దీన్ మతుకుమల్లి ఎస్సీకాలనీలోని సంఘటనా స్థలాన్ని సందర్శించి సాక్షులను విచారించారు. సేకరించిన ఆధారాలపై నివేదికను తయారు చేసి ఉన్నతాధికారులకు అందజేయనున్నట్లు డీఎస్పీ తెలిపారు. ఆయనతో పాటు ఎస్‌ఐ తిరుపతిరావు, రైటర్ శ్రీనివాసరావు, కానిస్టేబుల్ నిర్గుణబాబు తదితరులు పాల్గొన్నారు.

బీసీలకు తీరని అన్యాయం చేసిన జగన్



శావల్యాపురంలో జయహో బీసీ సభలో మాట్లాడుతున్న జీవీ

పల్నాడు జిల్లా టీడీపీ అధ్యక్షుడు జీవీ ఆంజనేయులు

శావల్యాపురం, ఫిబ్రవరి 2: ఒక్క చాన్సంటూ బీసీల ఓట్లతో అధికారంలోకి వచ్చిన సీఎం జగన్మోహన్‌రెడ్డి బీసీలకు తీరని అన్యాయం చేశాడని, బీసీలను అన్ని విధాల అణగదొక్కి బీసీల ద్రోహిగా చరిత్రలో మిగిలిపోయాడని పల్నాడు జిల్లా టీడీపీ అధ్యక్షులు, మాజీ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు విమర్శించారు. శావల్యాపురంలో జయహో బీసీ సభను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. మండలంలోని అన్ని గ్రామాల నుంచి వేలాది మంది బీసీ నాయకులు, కార్యకర్తలు, మహిళలు జయహో బీసీ సభకు తరలివచ్చి బీసీల ఐక్యతను చాటారు. శావల్యాపురం సెంటర్లోని ఎన్టీఆర్, పరిటాల, అంబేద్కర్ విగ్రహాలకు బీసీ నాయకులతో కలసి జీవీ పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం పీహెచ్‌సీ పక్కన ఏర్పాటు చేసిన సభావేదిక వరకు జీవీతో పాటు కార్యకర్తలంతా ర్యాలీగా తరలివచ్చారు. జీవీ మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ బీసీలకు పుట్టినిల్లు లాంటిదని, ఎన్టీఆర్ బీసీలకు పార్టీలో అత్యంత ప్రాధాన్యం ఇచ్చారని, బీసీలకు ఎన్టీఆర్ 24శాతం రిజర్వేషన్ కల్పిస్తే చంద్రబాబు దానికి 10శాతాన్ని జోడించి 34శాతం రిజర్వేషన్‌లిచ్చిన మహనీయుడన్నారు. కానీ వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక సీఎం జగన్మోహన్‌రెడ్డి బీసీ రిజర్వేషన్లను 34శాతం నుంచి 24శాతానికి తగ్గించి బీసీలకు తీరని అన్యాయం చేశాడని, 16వేలమంది బీసీలు తమ పదవులను కోల్పోయారన్నారు. చంద్రబాబు హయాంలో ఆదరణ పథకంతో బీసీలకు పెద్దఎత్తున లబ్ధిచేకూర్చితే బీసీలకు చెందిన 30 పథకాలను నిలిపివేసిన దుర్మార్గుడు జగన్మోహన్‌రెడ్డి అని ఆగ్రహం వ్యక్తం చేశారు. రూ.75వేల కోట్లు బీసీ సబ్‌ప్లాన్ నిధులను దారి మళ్లించారని, 56 బీసీ కార్పొరేషన్‌లు ఏర్పాటుచేసి ఒక్క రూపాయి కూడా కేటాయించకుండా బీసీలను మోసం చేశాడన్నారు. రాష్ట్రంలో 74మంది బీసీలు ఆత్మహత్యలు చేసుకున్నారని, వేలాదిమంది బీసీలపై వైసీపీ ప్రభుత్వం అక్రమంగా కేసులు బనాయించిందన్నారు. రాష్ట్రంలో 100 ఎమ్మెల్యే స్థానాలను మారేందుకు సీఎం జగన్మోహన్‌రెడ్డి సిద్ధమైతే సీఎంనే మార్చేందుకు ప్రజలంతా సిద్ధమయ్యారని అన్నారు. ఏపీ పీసీసీ అధ్యక్షురాలిగా షర్మిలను నియమించగానే జగన్‌రెడ్డికి, ఎంపీలు, ఎమ్మెల్యేలకు సినిమా అర్థమైందని, అందుకే వైసీపీ ఎంపీలు, ఎమ్మెల్యేలు ఎవరి దారి వారు చూసుకుంటున్నారని అన్నారు. టీడీపీ, జనసేన సంయుక్తంగా 167 స్థానాలలో విజయం సాధించడం ఖాయమన్నారు. టీడీపీ క్రమశిక్షణ సంఘం సభ్యుడు గుంటుపల్లి నాగేశ్వరరావు, పల్నాడు జిల్లా టీడీపీ బీసీ సెల్ అధ్యక్షుడు మొన్న రాంబాబు, బీసీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గంగాధర్, అధికార ప్రతినిధి ఒత్తుల వెంకటేశ్వర్లు, వినుకొండ నియోజకవర్గ బీసీ సెల్ అధ్యక్షుడు ఒత్తుల గోవిందరాజులు, శావల్యాపురం మండల బీసీ సెల్ అధ్యక్షుడు ఎర్రగొర్ల ఆదినారాయణ, టీడీపీ మండలాధ్యక్షుడు గుంటూరు సాంబశివరావు, జనసేన మండలాధ్యక్షుడు అడపాల అనిల్‌కుమార్, టీడీపీ నాయకులు యరమాసు కోటేశ్వరరావు, గడిపూడి విశ్వనాధం, బొల్లా పేరయ్య, దొడ్డా ఏడుకొండలు, గోరంట్ల హనుమంతరావు, గద్దె మస్తాన్ రావు, చింతా గంగయ్య, అమృతపూడి కోటయ్య తదితరులు పాల్గొన్నారు.

నరసరావుపేట అసెంబ్లీ అభ్యర్థి రేసులో నేను ఉన్నా

● ఎమ్మెల్యే గోపిరెడ్డి వల్ల ఇబ్బంది పడుతున్న వారి సమస్యలు పరిష్కరిస్తా ● డాక్టర్ గజ్జల బ్రహ్మారెడ్డి

నరసరావుపేట రూరల్, ఫిబ్రవరి 2: నరసరావుపేట అసెంబ్లీ అభ్యర్థి రేసులో నేను ఉన్నానని స్థానిక వైసీపీ సీనియర్ నాయకుడు గజ్జల బ్రహ్మారెడ్డి బహిరంగంగా ప్రకటించారు. నరసరావుపేట మండలం పెదరెడ్డిపాలెంలో శుక్రవారం సాయంత్రం కార్యకర్తల సమావేశం నిర్వహించారు. నరసరావుపేట ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి వ్యతిరేక వర్గం అంతా ఒక్కచోట సమావేశమయ్యారు. ఎమ్మెల్యే గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి వలన ఇబ్బంది పడుతున్న వారందరూ తమ వద్దకు రావాలని డాక్టర్ గజ్జల బ్రహ్మారెడ్డి పిలుపినిచ్చారు. నరసరావుపేట అసెంబ్లీ అభ్యర్థిని వైసీపీ అధిష్టానం ఇంకా ప్రకటించలేదని వైసీపీ అభ్యర్థుల పరిశీలనలో తనపేరు కూడా ఉందని తెలిపారు. రానున్న ఎన్నికల్లో నరసరావుపేటలో మరోసారి వైసీపీ జెండా ఎగర వేసేందుకు కార్యకర్తలందరూ కృషిచేయాలని పిలుపినిచ్చారు. కార్యక్రమంలో వైసీపీ నాయకులు అబ్దుల్ హనీఫ్, చల్ల శ్రీనివాసరావు, వై.రవీంద్రారెడ్డి, బి.వీరారెడ్డి, కందుల దినేష్‌రెడ్డి, భవనం శశిధర్‌రెడ్డి, కోడె హనుమంతరావు, పాశం సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

నిరుద్యోగుల చెవిలో పూలు పెట్టేందుకే దగా డీఎస్సీ

తెలుగు యువత రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి పొనుగోటి



అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న తెలుగుయువత, టీఎన్ఎస్ఎఫ్ నాయకులు

నరసరావుపేట టౌన్, ఫిబ్రవరి 2: మెగా డీఎస్సీ ఇవ్వకుండా నిరుద్యోగుల చెవిలో పూలు పెట్టడానికి జగన్‌మోహన్‌రెడ్డి దగాచేసి 6100 పోస్టులకు నోటిఫికేషన్ ఇచ్చారని తెలుగు యవత రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి పొనుగోటి శ్రీనివాసరావు అన్నారు. శుక్రవారం పల్నాడు జిల్లా కేంద్రం నరసరావుపేట పట్టణంలోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహం వద్ద టీఎన్ఎస్ఎఫ్, తెలుగు యువత ఆధ్వర్యంలో చెవిలో పూలు పెట్టుకొని నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా పొనుగోటి శ్రీనివాసరావు మాట్లాడుతూ ఎన్నికల ముందు హామీలు ఇస్తే దానికి విశ్వసనీయత ఉండదని జగన్‌మోహన్ రెడ్డి అన్నారని గుర్తుచేశారు. మెగా డీఎస్సీ ఇస్తానని జగన్‌మోహన్‌రెడ్డి అన్నారని, 50వేలు పై ఉపాధ్యాయ పోస్టులు ఖాళీగా ఉన్నాయని చెప్పారని గుర్తు చేశారు. ఎన్నికలకు 65రోజుల ముందు నోటిఫికేషన్ ఇస్తే విశ్వసనీయత ఉంటుందా? అని ప్రశ్నించారు. పల్నాటి జిల్లా టీఎన్ఎస్ఎఫ్ అధ్యక్షుడు కూరపాటి హనుమంతురావు మాట్లాడుతూ సంవత్సరానికి ఒక డీఎస్సీ ఇస్తానని చెప్పిన జగన్‌మోహన్‌రెడ్డి, నాలున్నర సంవత్సరాలు కాలక్షేపం చేసి ఎన్నికలకు రెండు నెలల ముందు డీఎస్సీ అని గేమ్ ప్లే చేస్తున్నాడని విమర్శించారు. రాష్ట్ర తెలుగు యువత అధికార ప్రతినిధి షేక్ మహమ్మద్ రఫీ మాట్లాడుతూ రాష్ట్రంలో 2.30 లక్షలు పోస్టులు ఖాళీగా ఉన్నాయని, ప్రతి సంవత్సరం జనవరికి జాబ్ క్యాలెండర్లు ఇస్తానని చెప్పారని, ఇప్పటికి ఐదు జనవరిలు అయిపోయినా ఒక్క జాబ్ క్యాలెండర్ విడుదల చేయకుండా మోసం చేశారని విమర్శించారు. నిరుద్యోగ యువత కేవలం జగన్‌మోహన్‌రెడ్డి వలన గంజాయి తదితర మత్తు పదార్థాలకు అలవాటు పడ్డారని ఆవేదన వ్యక్త చేశారు.

కార్యక్రమంలో తెలుగు యువత జిల్లా అధ్యక్షుడు కుమ్మెత కోటిరెడ్డి, యేనుగంటి భార్గవ్ సాయి, తెలుగుయువత నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి గంగిరెడ్డి శ్రీనివాసరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్నేషనల్ హాకీ ప్లేయర్ లక్ష్మీరజినీకి ఘన సన్మానం



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న ఇంటర్నేషనల్ హాకీ ప్లేయర్ లక్ష్మీ రజినీ

బొల్లాపల్లి, ఫిబ్రవరి 2: మండలంలోని వెల్లటూరు జిల్లా పరిషత్ హైస్కూల్‌లో ఇంటర్నేషనల్ హాకీ క్రీడాకారిణికి లక్ష్మీరజినీకి శుక్రవారం ఘనంగా అభినందన సభ నిర్వహించారు. ముందుగా హాకీప్లేయర్ రజినీని ఊరేగింపుతో వెల్లటూరు జడ్పీ హైస్కూల్ విద్యార్థులు రజినీకి ఎదురెళ్ళి ఊరేగింపుగా జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు తీసుకువచ్చారు. ముందుగా వెల్లటూరులోని శ్రీసుబ్బరి యేగేంద్రస్వామి దేవాలయంలో పూజలు నిర్వహించారు. అనంతరం ఊరేగింపుగా తీసుకువచ్చారు. పాఠశాల ఉపాధ్యాయులు సైదా అధ్యక్షతన జరిగిన అవగాహన సదస్సులో లక్ష్మీరజిని మాట్లాడుతూ 17 సంవత్సరాలు కష్టపడి నందు వలనే నేడు ఈ స్థాయికి ఎదిగానని, ఎన్నో ఆటుపోటులను ఎదుర్కొని ఉన్నత శిఖరాలకు ఎదిగి నేడు దేశంలోనే రజిని అంటే గుర్తింపు సంపాదించుకున్నానన్నారు. మారుమూల ప్రాంతంలోని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యనభ్యసించి 2008 నుంచి కష్టపడుతూ ఉపాధ్యాయులు, కోచ్‌లు చెప్పినవి పాటించటం వలనే హాకీ టీమ్‌కు కెప్టెన్‌గా ఉంటూ దేశం తరుపున ఇతర దేశాల్లో ఆటలాడి పలు దేశాలతో పోటీపడి దేశ ప్రజలు గర్వించదగిన విధంగా ఎదుగుతూ అనేక పతకాలు తేవటంతో పాటు దేశ, రాష్ట్ర ప్రముఖులతో అనేక సన్మానాలు అందుకున్నానన్నారు. అందిన సంతృప్తి, దక్కిన ప్రేమ మా మెట్టినిల్లు వెల్లటూరు గ్రామంలో దక్కిందన్నారు. తన చిన్న నాటి జ్ఞాపకాలను గుర్తు చేశాయన్నారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు, గ్రామస్తులు ఆమెను పూలమాలలు, శాలువాలతో ఘనంగా సన్మానించారు. విద్యార్థులు రజినీతో ఫొటో దిగేందుకు ఉత్సాహం చూపించారు. కాగా రజినీ దంపతులను పూలమాలలు, శాలువాలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో గ్రామస్థులు కజ్జాయం లక్ష్మీనారాయణ, అడకా లింగరాజు, వారి తల్లిదండ్రులు మల్లికార్జునాచారి, పూర్వ విద్యార్థులు, పాఠశాల ఉపాధ్యాయులు చంద్రజిత్ యాదవ్, లావణ్య, నారాయణరావు తదితరులు పాల్గొన్నారు.

నిరుపేద జాతీయ క్రీడాకారుడికి ఆర్థికసాయం

వినుకొండ, ఫిబ్రవరి 2: జాతీయ క్రీడాకారుడు షేక్ అబ్దుల్లాకు పట్టణంలోని కృష్ణవేణి డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ యోగి రూ.10వేలు ఆర్థికసాయాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిరుపేద కుటుంబంలో జన్మించిన అబ్దుల్లా దేశవిదేశాల్లో పరుగు పందెంలో మంచి ప్రావీణ్యం సంపాదించి వినుకొండ కీర్తిప్రతిష్ఠను ఇనుమడింపజేశారని, ఒలంపిక్స్ కోచ్ ఆమ్లేష్‌కుమార్ వద్ద శిక్షణ తీసుకుంటున్న నేపథ్యంలో ఖర్చుల నిమిత్తం ఆర్థికసాయం చేయడం జరిగిందని తెలిపారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.

ఆల్ ఇండియా బేస్‌బాల్ జట్టుకు ధనలక్ష్మీ కళాశాల విద్యార్థి

ఈపూరు, ఫిబ్రవరి 2: మండలంలోని ముప్పాళ్ళ ధనలక్ష్మీ వ్యాయామ కళాశాల విద్యార్థి షేక్ హయూమ్ ఆల్ ఇండియా బేస్‌బాల్ జట్టుకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ చుండు వెంకట్రావు శుక్రవారం తెలిపారు. జనవరి 31, ఫిబ్రవరి 1వ తేదీలలో ఆర్‌వీఆర్ అండ్ జేసీ ఇంజనీరింగ్ కళాశాలలో జరిగిన బేస్‌బాల్ పోటీలలో హయూమ్ ప్రతిభ కనబరిచి ఆచార్య నాగార్జున యూనివర్శిటీ జట్టుకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ తెలిపారు.

దేవాలయంలో విగ్రహం, హుండీ ధ్వంసం

నాదెండ్ల, ఫిబ్రవరి 2: మండలంలోని సంక్రాంతిపాడు గ్రామ పరిధిలోని వెంకటేశ్వరస్వామి దేవాలయంలో గుర్తుతెలియని వ్యక్తులు విగ్రహంతో హుండీని గురువారం అర్ధరాత్రి ధ్వంసం చేశారు. సంక్రాంతిపాడు నుంచి చిరుమామిళ్ళ వెళ్ళే మార్గంలో ఉన్న ఈ దేవాలయంలో వెంకటేశ్వర స్వామితో పాటు అలివేలు మంగమ్మ, బీబీ నాంచారుల విగ్రహాలు ఉన్నాయి. దుండగులు బీబీ నాంచారి విగ్రహాన్ని పగలగొట్టి పొలాల్లో పడవేశారు. చోరీకి వచ్చిన వారే ఈ పని చేసినట్టు గ్రామస్థులు అనుమానిస్తున్నారు. పోలీసులకు గ్రామస్థులు ఎలాంటి ఫిర్యాదు చేయలేదు.

స్కేటింగ్‌లో భానుగణేష్‌కు బంగారుపతకం

వినుకొండ టౌన్, ఫిబ్రవరి 2: ఇటీవల సిమ్లాలో జరిగిన 15వ ఆమెచూర్ రోలర్ స్కేటింగ్ చాంపియన్‌షిప్‌లో మార్కాపురం రోడ్డులోని వికాస్ పాఠశాలలో 7వ తరగతి విద్యార్థి నల్లం భానుగణేష్ ప్రతిభ చూపినట్లు పాఠశాల కరస్పాండెంట్ లింగా మార్కండేయులు శుక్రవారం తెలిపారు. పోటీల్లో వెయ్యి మీటర్ల స్కేటింగ్ కాంపిటేషన్ విభాగంలో బంగారు పతకం, 400 మీటర్ల స్కేటింగ్ కాంపిటిషన్‌లో వెండిపతకం సాధించాడు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

శావల్యాపురం, ఫిబ్రవరి 2: ద్విచక్రవాహనాన్ని వేగంగా వస్తున్న కారు ఢీకొట్టడంతో ఇద్దరు వ్యక్తులు గాయపడిన సంఘటన గుంటూరు-కర్నూలు జాతీయ రహదారి మార్గంలో శావల్యాపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సమీపంలో శుక్రవారం జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల మేరకు కనమర్లపూడికి చెందిన నంబూరి చిన్నపేరయ్య, బోడెపూడి పేరయ్యలు ద్విచక్రవాహనంపై వెళుతూ శావల్యాపురంలోని పెట్రోల్‌బంక్‌లో ఆయిల్ కొట్టించేందుకు వెళుతుండగా తణుకు నుంచి వినుకొండకు వెళుతున్న కారు వేగంగా వచ్చి ఢీకొట్టింది. దాంతో ద్విచక్రవాహనంపై ఉన్న చిన్నపేరయ్య, పేరయ్యలు రోడ్డుపై పడడంతో చిన్నపేరయ్య ఎడమకాలుకి తీవ్ర గాయమైంది. పేరయ్యకు స్వల్ప గాయాలయ్యాయి. స్థానికులు 108 సిబ్బందికి సమాచారం అందించగా వారు క్షతగాత్రులను వినుకొండ ప్రభుత్వాసుపత్రికి తరలించినట్లు స్థానికులు తెలిపారు.

ద్విచక్రవాహనం అదుపుతప్పి ఒకరికి...

వినుకొండ టౌన్, ఫిబ్రవరి 2: ద్విచక్రవాహనంపై నుంచి వ్యక్తి కిందపడి గాయాలైన సంఘటన మండలంలోని చీకటీగలపాలెం అడ్డరోడ్డు వద్ద శుక్రవారం చోటుచేసుకుంది. బాధితుని కథనం మేరకు... శావల్యాపురం మండలం పోట్లూరు గ్రామానికి చెందిన దానియేలు ద్విచక్రవాహనంపై అడ్డరోడ్డునుంచి వినుకొండ వస్తూ ద్విచక్రవాహనం అదుపుతప్పడంతో గాయాలయ్యాయి. స్థానికులు దానియేలును చికిత్స నిమిత్తం వినుకొండకు తరలించారు.

బొల్లాపల్లిలో డబుల్ ఎంట్రీలు

బొల్లాపల్లి, ఫిబ్రవరి 2: మండలంలోని వెల్లటూరు, బొల్లాపల్లి, పలుకూరు గ్రామాల్లో ఇంకా నకిలీ ఓట్లు ఉన్నాయి. ఒకే పేరుతో డబుల్ ఎంట్రీలు చనిపోయిన వారిని ఓటరు లిస్టులో తొలగించకపోవటంతో మరోసారి జాబితాను వడపోయాల్సిందేనని రాజకీయ పార్టీలు డిమాండ్ చేస్తున్నాయి. ఏపీ ఓటర్ల తుది జాబితాను ఇటీవల ఎన్నికల సంఘం విడుదల చేసింది. దాదాపు అన్ని బోగస్ ఓట్లను తొలగించామని పేర్కొంది. ఐతే ఇంకా చాలా నకిలీ ఓట్లు ఉన్నాయని ప్రతిపక్షాలు ఆరోపిస్తున్నాయి. ఒకే ఫొటో, చిరునామా, చనిపోయిన వారి ఓట్లు ఉన్నాయని ఆరోపణలు వస్తున్నాయి. దీంతో రాజకీయ పార్టీల నుంచి ఆందోళన వ్యక్తమవుతోంది. ఇప్పటికైనా గ్రామాల్లో ఉన్న నకిలీ ఓట్లను, డబుల్ ఎంట్రీలను, చనిపోయిన వారిని తొలగించాలని పలు రాజకీయ పార్టీలు డిమాండ్ చేస్తున్నాయి.

కొత్త ప్రభుత్వంతోనే చిలకలూరిపేట సమగ్రాభివృద్ధి

● మాజీ మంత్రి ప్రత్తిపాటి పుల్లారావు



ముస్లిం మత పెద్దలతో కలసి దువా కార్యక్రమంలో పాల్గొన్న మాజీ మంత్రి ప్రత్తిపాటి, జనసేన సమన్వయకర్త రాజా రమేష్ తదితరులు

చిలకలూరిపేట అర్బన్, ఫిబ్రవరి 2: రాబోయే ఎన్నికల అనంతరం ఏర్పడబోయే తెలుగుదేశం, జనసేన కూటమి ప్రభుత్వంతోనే చిలకలూరిపేట సమగ్రాభివృద్ధి సాధ్యమని మాజీమంత్రి, రాష్ట్ర తెలుగుదేశం పార్టీ ఉపాధ్యక్షుడు ప్రత్తిపాటి పుల్లారావు అన్నారు. స్థానిక పరిస్థితులు సమస్యలు తెలిసిన వ్యక్తిగా రానున్న ఐదు సంవత్సరాల్లో ఈ ప్రాంతానికి ఏం చేయాలో కూడా తనకు స్పష్టమైన అవగాహన, ప్రణాళిక ఉందన్నారు. మధ్యలో వచ్చిన వలస పక్షుల బెడద లేకుంటే ఈ పాటికే నియోజకవర్గం రూపురేఖలు మార్చి ఉండేవారన్నారు. చిలకలూరిపేటలో అమీన్‌పీర్ ఇదారా ఆధ్వర్యంలో శుక్రవారం జరిగిన ప్రత్యేక దువా కార్యక్రమంలో తెలుగుదేశం, జనసేన నాయకులతో కలసి ప్రత్తిపాటి పాల్గొని దువా నిర్వహించారు. కడప అమీన్ పీర్ దర్గాకు సంబంధించి వారి శిష్య బృందం ఆధ్వర్యంలో ఈ దువా కార్యక్రమం జరిగింది. అనంతరం ప్రత్తిపాటి మాట్లాడుతూ చిలకలూరిపేట ప్రాంత ప్రజల సుఖ సంతోషాల కోసం దువా చేసినట్టు తెలిపారు. ప్రజలు ఎంతో నమ్మకంతో గత ఎన్నికల్లో ఇచ్చిన అవకాశాన్ని వైసీపీ ప్రజా ప్రతినిధి తన స్వార్థానికి వాడుకొని ఇక్కడి అభివృద్ధిని గాలికి వదిలి వేశారన్నారు. రానున్న ఎన్నికల్లో అలాంటి పొరపాటు మరలా జరగదని, రానున్న టీడీపీ, జనసేన కూటమి పాలనలో ప్రతి సమస్యకు పరిష్కారం చూపిస్తామన్నారు.

ఈ కార్యక్రమంలో జనసేన సమన్వయకర్త తోట రాజా రమేష్, ముస్లిం మత పెద్దలు, ఇదారా కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

చిలకలూరిపేట 20వ వార్డులో టీడీపీ కార్యాలయం ప్రారంభం

చిలకలూరిపేట అర్బన్, ఫిబ్రవరి 2: పట్టణంలోని 20వ వార్డులో శుక్రవారం మాజీమంత్రి ప్రత్తిపాటి పుల్లారావు సమక్షంలో పార్టీ పట్టణ అధ్యక్షుడు పఠాన్‌సమద్ ఖాన్ పార్టీ కార్యాలయాన్ని రిబ్బన్ కట్‌చేసి ప్రారంభించారు. స్థానిక పార్టీ నాయకులకు, కార్యకర్తలకు అందుబాటులో ఉండేందుకు ఇటీవల టీడీపీలో చేరిన కౌస్తుబా సోషల్ అండ్ కల్చర్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు గోమాత నవీన్ నాయుడు ఆధ్వర్యంలో పార్టీ కార్యాలయాన్ని ఏర్పాటు చేశారు.



చిలకలూరిపేటలో నిరసన తెలుపుతున్న న్యాయవాదులు

న్యాయవాదుల నిరసన ర్యాలీ

చిలకలూరిపేట, ఫిబ్రవరి 2: రాష్ట్రంలో కొత్తగా వచ్చిన భూహక్కు చట్టాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం న్యాయవాదులు బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పట్టణంలో బైక్ ర్యాలీ నిర్వహించారు. కోర్టు వద్ద నిరసన ప్రదర్శన జరిపారు. ఈ చట్టం ద్వారా ప్రజలకు తీవ్ర అన్యాయం జరుగుతుందని న్యాయవాదుల అభిప్రాయంగా ఉంది. స్థానిక సాంబశివనగర్‌లోని కోర్టు వద్ద నుంచి బయలుదేరిన న్యాయవాదులు నరసరావుపేట సెంటర్‌లో మానవహారంగా ఏర్పడ్డారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయం వద్దకు చేరుకొని తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు నాగబాబు, న్యాయవాదులు ఆర్.వెంకటేశ్వర్లు, పురుషోత్తం, జీ ప్రసన్న, నల్లపు కోటి, వెంకటేశ్వర్లు, పుల్లగూర జాన్, భాను ప్రసాదు తదితరులు పాల్గొన్నారు.

మెగా డీఎస్సీ ఇవ్వకపోతే ఓటమి తప్పదు: సుభానీ

చిలకలూరిపేట, ఫిబ్రవరి 2: ముఖ్యమంత్రి జగన్ మెగా డీఎస్సీ ఇవ్వకపోతే ఎన్నికల్లో మెగా ఓటమి తప్పదని ఏఐవైఎఫ్ పల్నాడు జిల్లా కన్వీనర్ సుభానీ శుక్రవారం హెచ్చరించారు. స్థానిక సీపీఐ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ ఎన్నికల ముందు 25వేల టీచర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయని, మెగా డీఎస్సీ ద్వారా వాటిని భర్తీ చేస్తామని చెప్పి ఐదు సంవత్సరాలుగా ఊరించి ఇప్పుడు 6,100 పోస్టులు మాత్రమే భర్తీ చేస్తామనటం మెగా మోసం అని ఆయన విమర్శించారు. ఐదు సంవత్సరాలుగా కోచింగ్ సెంటర్లలో కోచింగ్ తీసుకొని హాస్టల్‌లో ఉంటూ డీఎస్సీ కోసం ఎదురు చూస్తున్న నిరుద్యోగులను జగన్ ప్రభుత్వం దారుణంగా మోసం చేసిందన్నారు. సమావేశంలో మల్లికార్జున్, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

జాతీయ పుట్‌బాల్ పోటీల్లో ఏఎంజీ డిగ్రీ విద్యార్థుల ప్రతిభ



విద్యార్థులను అభినందిస్తున్న డైరెక్టర్ మహంతి

చిలకలూరిపేట, ఫిబ్రవరి 2: పట్టణంలోని స్వచ్ఛంద సేవా సంస్థ ఏఎంజీ డిగ్రీ కళాశాలకు చెందిన విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరిచారు. జాతీయ స్థాయిలో ఈ పోటీలను తెలంగాణాలోని షాద్‌నగర్‌లో నిర్వహించారు. సీనియర్ పుట్‌బాల్ చాంపియన్ షిప్ 2024 పోటీల్లో ఆంధ్రా జట్టు తరుపున ఏఎంజీ విద్యార్థులు పాల్గొన్నారు. ఈ జట్టుకు ఏఎంజీ విద్యార్థిని పీ అంజలి కెప్టెన్‌గా నేతృత్వం వహించారు. ఆంధ్రాతో పాటు తెలంగాణా, జార్ఖండ్, మహారాష్ట్రలకు చెందిన జట్లు పోటీ పడ్డాయి. కాగా ఆంధ్రా జట్టు ద్వితీయ బహుమతి సాధించింది. వీరికి షీల్డ్‌తో పాటు సర్టిఫికెట్‌ను అందజేశారు. కెప్టెన్‌గా వ్యవహరించిన అన్నింటితో పాటు జట్టు సభ్యులు పావని, సాగర్ రాణి, జ్యోతి రమ్య, పూజితలను ఏఎంజీ డైరెక్టర్ అభినందించారు. భవిష్యత్‌లో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. అభినందించిన వారిలో డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ పీ లావణ్య, కోచ్ ఇన్‌చార్జ్ ఎం సరళ తదితరులు ఉన్నారు.

'రహదారి భద్రతా నియమాలను పాటించాలి'

నరసరావుపేట రూరల్, ఫిబ్రవరి 2: రహదారిపై వాహనాలను నడిపే ప్రతి ఒక్కరూ రహదారి భద్రతా నియమాలను తప్పనిసరిగా పాటించాలని జిల్లా రవాణశాఖ అధికారి టీకే పరంధామరెడ్డి తెలిపారు. పల్నాడు జిల్లా కేంద్రమైన నరసరావుపేటలో జిల్లా రవాణా శాఖ కార్యాలయంలో 35వ జాతీయ రహదారి భద్రతా మాసోత్సవాలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో మోటార్‌వెహికల్ ఇన్స్‌పెక్టర్ సత్యనారాయణ ప్రసాద్, శివనాగేశ్వరరావు, రోడ్‌సేఫ్టీ మెడికల్ ఆఫీసర్ నవ్య తదితరులు పాల్గొన్నారు.

మార్చి 9న లోక్ అదాలత్

చిలకలూరిపేట, ఫిబ్రవరి 2: చిలకలూరిపేట మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో మార్చి 9వ తేదీన జాతీయ లోక్ అదాలత్‌ను నిర్వహించటం జరుగుతుందని సంస్థ ఛైర్మన్ ఏ నరేంద్రరెడ్డి శుక్రవారం తెలిపారు. పట్టణంలోని రెండు కోర్టుల్లో ఉన్న పెండింగ్‌లో ఉన్న రాజీపడదగిన కేసులను ఈ లోక్ అదాలత్‌లో పరిష్కరించుకోవచ్చునన్నారు. రాజీపడదగిన క్రిమినల్, సివిల్, భరణం, చెక్ బౌన్స్, ముందస్తు రాజీకేసులు లోక్ అదాలత్ ద్వారా పరిష్కరించనున్నట్లు తెలిపారు.